వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 29 ఆగస్టు 2022


## ప్రమాదంలో గాయపడిన వృద్ధునికి వీల్‌చైర్ వితరణ

**మైదుకూరు ఆగస్టు 28, ప్రభాతవార్త**




రహదారి ప్రమాదంలో రెండు మోకాళ్ళ కు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న బి. నరసింహులు అనే వృద్ధునికి వీల్ చైర్ అందించి తమ సేవానిరతిని చాటారు ఫ్రెండ్స్ ఫరెవెర్ సభ్యులు. గత నెలలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒంటిమిట్ట మండలం గుంటికాడపల్లెకు చెందిన బి. నరసింహులు(60) తీవ్రంగా గాయ పడి నెల రోజులుగా రిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. రెండు మోకాళ్ళ వద్ద తీవ్ర గాయాలతో అవస్థ పడుతున్న నరసింహులు అవస్థను నేస్తం సేవా సంస్థ సభ్యుడు కోగటం కొండారెడ్డి గుర్తించి ఫ్రెండ్స్ ఫరెవెర్ సంస్థ సభ్యులకు తెలిపారు. దీంతో స్పందించిన సభ్యులు దాత :వంకధార గురు బ్రహ్మయ్య వారి ధర్మపత్ని సుబ్బరత్నమ్మ గారి వితరణ తో వీల్ చైర్ ను వృద్ధుడు నరసింహులు కు అందజేశారు. తనకు వీల్ అందజేసిన దాతలకు, స్వచ్ఛంధ సంస్థ సభ్యులకు ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న వృద్ధుడు బి. నరసింహులు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫరెవెర్ సభ్యులు యస్వంథ్ రాజా, ప్రమోద్, సాయిరాం, వాసు, శ్యామరాజ్, కోగటం కొండారెడ్డి పాల్గొన్నారు.

## యువ న్యాయవాది అనారోగ్యంతో మృతి

**కడప లీగల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**



జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న వివిధ కోర్టులలో న్యాయవాదిగా పనిచేస్తున్న యువ న్యాయవాది నామాల వెంకట సుధాకర్ (27) అనారోగ్యంతో ఆది వారం మృతి చెందాడు. ఈయన న్యాయవాదుల సంఘంలో సభ్యుడిగా ఉంటూ కడప కోర్టులలో విధులు నిర్వహిస్తూ ఉండేవాడు. ఇటీవల శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో లీగల్ మేనేజర్‌గా పని చేస్తుండగా గత 2 రోజులుగా అనారోగ్యంతో ఉంటూ చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉండగా ఆదివారం మృతి చెందాడు. ఈ యువ న్యాయవాది మృతికి కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెనెడీలు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. యువ న్యాయవాది సుధాకర్ మృతికి గౌరవ సూచికగా సోమవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఆవరణలో సంతాప సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# 1, 2న వేల్పులలో ముఖ్యమంత్రి జగన్ పర్యటన

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టరు విజయ్‌రామరాజు




**పులివెందుల, ఆగస్టు 28, ప్రభాతవార్త**

సెప్టెంబరు 1, 2 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టరు విజయ్‌రామరాజు ఆదేశించారు. ఆదివారం వేముల మండలంలోని వేల్పులలో అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాన్ని జిల్లా కలెక్టరు విజయ్‌రామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ కడప నగర కమీషనరు సాయి ప్రవీణ్‌చంద్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. కడప-పులివెందుల రోడ్డు మార్గం లో సువిశాలమైన ప్రాంగణంలో గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రం, వేల్పుల ప్రాథమిక సహకార పరపతి సంఘం, వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ, పోస్టాఫీసు, మంచినీటి పథకం ట్యాంకు, క్యాంటిన్ భవనాలను జిల్లా కలెక్టరు పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకుముందు హెలిప్యాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టరు పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. అధికారికంగా మినిట్ టు మినిట్ వివరాలు సీఎం కార్యాలయం నుండి రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, పులివెందుల, బద్వేలు ఆర్డీవోలు వెంకటేశ్, వెంకటరమణ, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాగులో కొట్టుకుపోయిన కారు

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి....నలుగురిని కాపాడిన గ్రామస్థులు



మౌనిక (పాతచిత్రం)

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త :**

అన్నమయ్యజిల్లా పెద్ద తిప్పసముద్రం మండలం సంపత్తికోట వాగులో శనివారం అర్ధరాత్రి వాగులో కారు కొట్టుకు పోవడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మౌనిక (22) మృతి చెందింది. మరో నలుగురిని గ్రామస్థులు కాపాడారు. గ్రామస్థుల కథనం మేరకు బి.కొత్త కోటలో ఓ ప్రైవేటు స్కూల్ నిర్వ హిస్తున్న కరస్పాండెంట్ రమణ భార్య రమాదేవి(37), కుమార్తె మౌనిక (22), శ్రీనివాసులు(39), డ్రైవర్‌తో కారులో బెంగుళూరుకు వెళ్ళారు. తిరిగి స్వగ్రామమైన బి.కొత్తకోట మండలం తోకలపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సంపత్తి కోట వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడం గమనించని డ్రైవర్ కారును వాగులోకి నడిపాడు. నీటి ఉధృతికి కారు కొట్టుకు పోయింది. కారులో ఉన్నవారు కేకలు వేయడంతో సంపత్తికోట ముంతగోకులపల్లె విషయాన్ని తమ దృష్టికి తెచ్చినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. గ్రామస్థులు వారిని రక్షించే ప్రయత్నం చేసేలోపే



నీటి ఉధృతికి మౌనిక కొట్టుకు పోయింది. ఆదివారం ఉదయం పిటిఎం పోలీసులు, కొత్తకోట పోలీసులు, మొలకల చెరువు అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలా నికి చేరుకొని గాలింపులు చేపట్టి ముంతగోకుల పల్లె వద్ద మౌనిక మృతదేహాన్ని వెలికితీశారు. మృతి చెందిన మౌనిక బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. బి.కొత్తకోట లోని బంధువులు, స్నేహితులు మౌనిక మృతదేహాన్ని సందర్శించి కన్నీరు మున్నీరుగా విలపించారు. స్వగ్రామమైన తోకలపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు.



# అన్నమయ్య ప్రాజెక్టు

# పునర్నిర్మాణ వ్యయం రూ. 801కోట్లు

అన్నమయ్య ప్రాజెక్టు ముఖ చిత్రం

- కొత్తరేట్ల ప్రకారం ప్రభుత్వానికి నివేదిక
- దేశంలోనే ఖరీదైన పునర్నిర్మాణ ప్రాజెక్టుగా రికార్డు
- ప్రాజెక్టు ప్రారంభించి 22 ఏళ్లు
- 15 రెట్లు పెరిగిన అంచనా వ్యయం
- 1 టిఎంసి నీటి నిల్వ ఖరీదు రూ.357 కోట్లు
- ముందే చెప్పిన 'వార్త'



ప్రాజెక్టు గేట్ల వెనుకభాగంలో దెబ్బతిన్న స్పిల్‌వే

**రాజంపేట అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

దేశంలోనే అత్యంత ఖరీదైన మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుగా అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ వ్యయం రికార్డుకెక్కనుంది. వివిధ కారణాలతో అంచనా వ్యయం భారీగా పెరిగింది. 2022-23 కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం జలవనరులశాఖ మరోసారి అంచనాలను రూపొందించింది. జులైలో 775 కోట్ల వ్యయమవుతుందని ప్రాజెక్టు అధికారులు జలవనరులశాఖ ఇంజనీరింగ్ చీఫ్‌కు నివేదిక పంపారు. వివిధ రిమార్కులను రెక్టిఫై చేసిన తర్వాత ఈనెల మొదటివారంలో కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లు వచ్చాయి. దీంతో కొత్త రేట్ల ప్రకారం ఎస్టిమేట్‌లు పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మరలా కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు రూపొందించారు. ఈ ప్రకారం 801 కోట్లు వ్యయమవుతుందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికిరణ్‌రెడ్డి 'వార్త'కు ఆదివారం తెలిపారు. ఈ మేరకు కొత్తరేట్ల ప్రకారం నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఇక ప్రభుత్వ అనుమతి కోసమే ఎదురు చూడాల్సి ఉంది. ఎందుకంటే సమగ్ర ప్రాజెక్టు నివేదిక దాదాపు పలుమార్లు పరిశీలన తర్వాత సిద్ధమైంది. ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్ కొట్టుకుపోయిన తర్వాత పునర్నిర్మాణం చేసేందుకు మట్టికట్ట అయితే సుమారు 200 కోట్ల వ్యయం కావచ్చని అంచనా వేశారు. కాంక్రీట్‌డ్యామ్ మాత్రమే కట్టాలని నిపుణుల నివేదిక సిఫారసు చేసింది. దీంతో నాడు ప్రాథమిక అంచనా వ్యయం 469 కోట్లకు పెరిగింది. పలు నివేదికలు, వివిధ భాగాల నిపుణులు సిఫారసులు ప్రాజెక్టు భవిష్యత్తు, 200 సంవత్సరాల వరదనీటి ప్రవాహం అంచనా, వాతావరణంలో మార్పులు అంచనా వేసిన తర్వాత ప్రాజెక్టుకు 5.60 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చినా విడుదల చేసేలా డిజైన్ రూపొందించారు. ప్రస్తుతం 5 గేట్లకు తోడు మరో 11 గేట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తం కాంక్రీట్‌డ్యామ్‌నే నిర్మిస్తారు. కాంక్రీట్‌డ్యామ్ నిర్మాణానికి నది వెడల్పు ఎక్కువగా ఉండడంతో పూర్తి కాంక్రీట్‌తో డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంచనాలు ఊహించని రీతిలో పెరిగాయి. ప్రధానంగా ప్రస్తుతం కొట్టుకుపోయిన ఎర్త్‌డ్యామ్ ప్రాంతంలో నదీగర్భంలో 30 అడుగుల వరకు ఇసుక ఉంది. దీంతో 30 అడుగుల కంటే ఇంకా కింది నుంచి పునాదులు కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉంది. దీని ఫలితమే కాంక్రీట్‌డ్యామ్ అంచనాలు భారీగా పెరిగాయని నివేదికలు రూపొందించిన ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. అన్నమయ్య డ్యామ్ నిర్మించేందుకు సుమారు 50 కోట్లు వ్యయమైంది. 22 ఏళ్ల తర్వాత ఎర్త్‌డ్యామ్ పునర్నిర్మించేందుకు ఏకంగా 15 రెట్లు పెరిగి 801 కోట్లకు చేరింది. ఇది ఇప్పటివరకు రాష్ట్రంలో ఖరీదైన పునర్నిర్మాణ ప్రాజెక్టు అధికారులు భావించినా దేశంలో కూడ దాదాపు ఇదే మొదటిది ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే 2.242 టిఎంసిల నీరు నిల్వ చేసేందుకు 801 కోట్ల వ్యయం అంటే ఒక టిఎంసి నీటి నిల్వ ఖర్చు 357 కోట్లు వ్యయం కానుంది. కాగా గతనెల 19న 'వార్త' దినపత్రికలో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ అంచనా వ్యయం 800 కోట్లకు

(మిగతా IIవ పేజీలో)

# ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సమ్యలు పరిష్కరిస్తాం

## ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష

**కడప కార్పొరేషన్ ఆగస్టు 28, ప్రభాతవార్త**



ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎన్నో కష్టాలు పడుతూ లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో బోధన చేయడం అభినందనీయ మని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబులు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు అండగా ఉంటామని కరస్పాండెంట్లకు భరోసా కల్పించారు. సమస్యలు పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ఆడిటోరియంలో ప్రైవేటు విద్యా సంస్థల సదస్సు జరిగింది. నిర్వాహకులు ముఖ్య అతిథులకు శాలు వా కప్పి ఘనంగా సన్మానించారు. తొలుత ప్రైవేటు పాఠ శాలల విద్యార్థినిలు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సమావేశానికి పుష్పగిరి విద్యా సంస్థల ఛైర్మన్ వివేకానందరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా మంత్రి అంజాద్‌బాషా, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యా నందరెడ్డిలు ప్రసంగించారు. సుమారు 45 శాతం మంది ప్రైవేటు విద్యాలయం లో ఉన్నత చదువులు అభ్యసించిన వారు ఉన్నారు. ప్రైవేటు విద్యాలయాలకు జగన్ సర్కార్ ఎప్పుడు అండగా ఉంటుం దన్నారు. సమస్యలను పరిష్క రిస్తుందని భరోసా కల్పించారు. ప్రభుత్వం మార్పులు చేసి నప్పుడు ప్రైవేటు పాఠశాలల ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. గతంలో 10 సంవత్సరాలుగా ఉన్న రెన్యువల్ ఆఫ్ రికగ్నైషన్‌ను 3 సంవత్సరాలకు కుదించారని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు బాధను వ్యక్తం చేశారు. తిరిగి 10 సంవత్సరాలకు కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ నిత్యా నందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు సూర్యనారాయణ, షఫీ, లక్ష్మయ్య, ప్రైవేటు అన్ ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ (స్మా) అధ్యక్షులు గువ్వల శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాగేంద్రరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డిగ్రీ కాలేజీల అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు మదన్మోహన్‌రెడ్డి, కృష్మా అధ్యక్షులు రమణారెడ్డి, గౌరవ అధ్యక్షులు ప్రబాకర్‌రెడ్డి, సెక్రటరీ బాల సుబ్బారెడ్డి, కళాశాల అధ్యక్షులు మదన్ మోహన్‌రెడ్డి (అర్చన విద్యా సంస్థలు), పుష్పగిరి విద్యా సంస్థల అధినేత వివేకా నందరెడ్డి, బీరం శ్రీధర్‌రెడ్డి విద్యా సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, కృష్మా మాజీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, మాజీ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, హ్యాపీ కిడ్స్ విద్యా సంస్థల అధినేత అనిల్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, సాజిద్‌బాషా, మహ్మద్, రాఘవేంద్రరెడ్డి, కళాశాల అధినేతలు విజయ్ కుమార్, సురేష్, రమణ పాల్గొన్నారు.




## వెయ్యి మంది బాలురకు 650 మంది బాలికలు

**గోపవరం,ఆగస్టు 28 ప్రభాతవార్త ;**

మండలంలో భ్రూణ హత్యలు రోజురోజుకూ అధికమవుతున్నాయి, ప్రస్తుత సర్వే ప్రకారం 1000 మంది బాలురుండగా బాలికలు మాత్రం కేవలం 650 మంది ఉన్నట్లు సర్వే నిర్ధారించింది,ఈ మేరకు మండల ప్రజలు ఒక్కతూరిగా ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది,రానున్న సమయంలో బాలికల నిష్పత్తి ఇంకా తగ్గే పరిస్థితి లేక పోలేదని,బావితరాల బాలురకు బారీగా ఇబ్బంది ఏర్పడుతుందని ప్రజలు తీవ్రఆందోళన చెందుతున్నారు. కాగా గుర్తు తెలి యని కొంత మంది మారుమూల గ్రామాలలో పర్యటించి ముందుగానే కావా ల్సిన ఏర్పాట్లు చేసి లింగ నిర్ధారణ ద్వారా అబార్శన్ చేయించుకొంటున్న పరి స్థితి ఏర్పడుతుందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు,అంతే కాకుం డా బాలికలకు రక్షణ కొరవడిందని,కొన్ని ఇబ్బందికరమైన సంఘటనలు ప్రస్తుత యువ దంపతులపై ప్రభావం చూపుతుంది,ఈ మేరకు బాలికల జననాలు నానాటికి తగ్గిపోతుండడం మరింత ఇబ్బందికరంగా మారింది. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబందిచిన సర్వే ద్వారా వెల్లడైన బాల,బాలికల నిష్పత్తిని పరిశీలించిన అటు అదికారులు ఇటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు, కాగా బాలికల నిష్పత్తిని పెంచేందుకు సంబందిత అదికారులతో పాటు ప్రతి ఒక్కరూ బాద్యత వహించాలిన అవసరం ఉంది. ఈ మేరకు ప్రభుత్వ వైద్యాది కారులతో పాటు మండల సిహెచ్ఓ, గౌస్, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి ఈ విషయమై ప్రజలకు అవగాహణా కార్యక్రమాలను చేపట్టారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు బాలికలకు మరింత ప్రోత్సాహకకరమైన పథకాలను ప్రవేశపెట్టి బాలికల నిష్పత్తిని పెంచెందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు,

## వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి

**- మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి**





**రామాపురం, ఆగస్టు 28ప్రభాతవార్త:**

వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని హసనాపురం పంచాయతీలోని హసనాపురం కస్బా ఎర్రంగి వాండ్లపల్లి చీకటి వాండ్లపల్లి హరిజనవాడ వసంత వండపల్లి, పెదమలవాండ్లపల్లి గ్రామాలలో బాదుడేబాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుండి బాదుడే బాదుడు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. వైఎస్సార్‌సిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధిక దరలు పెంచి సామాన్యులకు నడ్డి విరుస్తున్నారన్నారు. నిత్యవసర సరుకులు పెట్రోల్, డీజల్, గ్యాస్ అధిక ధరలు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి అనేక సబ్సిడీ స్కీమ్‌లు, వేల కోట్ల రూపాయలు ప్రజలకు సబ్సిడీలు పనిముట్లు రైతులు వచ్చేవని ఈ ప్రభుత్వంలో వాటికి మంగళం పాడారన్నారు. ఇచ్చే అరకొర డబ్బులకు మీకు ఇంత ఇచ్చాం అంతా ఇచ్చామంటూ కర పత్రాలు ముద్రించి ఇంటింటికి వెళ్లి ప్రజలను అవమాన పరుస్తున్నారన్నారు. గతంలో తెలుగు దేశం ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులను సబ్సిడీ రాయితీలను ప్రజలకు వేసేదని ఎక్కడ కూడా చెప్పేది కాదన్నారు. కానీ ఇప్పుడు వాలంటీర్లు ఏర్పాటు చేసి బిక్షం వేసినట్లు చెప్పడం తగదన్నారు. బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వంలో ఏ మాత్రం మేలు చేకూర లేదన్నారు. గతంలో ఉన్న సబ్సిడీలు తొలగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, రమేష్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు దివ్యకుమార్ రెడ్డి, లయన్ శివారెడ్డి, టిడిపి నాయకులు అఫ్రోజ్ సుభాన్, సహదేవరెడ్డి, నీలకంఠారెడ్డి, వెంకట్రామిరెడ్డి, హరిపుల్లా, అమర్నాథరెడ్డి, కదిరి బాషా, తెలుగు యూత్ అసెంబ్లీ అధ్యక్షులు జుబేర్, రమేష్ నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## టిడిపి నాయకుడు మండిపల్లి రాముడు



**రాయచోటి, ఆగస్టు 28, ప్రభాతవార్త**

శనివారం రోజు మదనపల్లెలో తన చెల్లెలు ఇంటికి వెళ్లి తిరిగి కారులో చిన్నమండెం ప్రయాణం చేస్తూ మార్గమధ్యంలో కేశపురం క్రాస్ వద్ద శనివారం రోజు చిన్నమండెంకు చెందిన ముగ్గురు యువకులు పూల వ్యాపారి బషీర్ కుమారులు అయిన గఫార్‌ఖాన్, ముత్యార్ అలీఖాన్ మరియు వారి స్నేహితుడు ఇంతియాజ్ ఖాన్ యాక్సిడెంట్‌లో ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. ప్రభుత్వాసుపత్రిలో వారి భౌతిక కాయాలని సందర్శించిన రాయచోటి టిడిపి నియోజక వర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రోడ్ విస్తరణలో భాగంగా డివైడ్లు ఏర్పాటు చేసి వెడల్పు చేయడం ద్వారా యువత వేగంగా బైకులు నడుపుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు అన్నారు. యాక్సిడెంట్ వల్ల భార్యాపిల్లలు,కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతున్నారు అన్నారు. ఈ విషయాల పట్ల యువత జాగ్రత్త వహించి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ద్విచక్ర వాహనాల పైన దూర ప్రయాణం చేసేవాళ్లు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని పిలుపునిచ్చారు.

## జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా వార్షిక సమావేశం

**కడప వైద్య విభాగం, ఆగస్టు 28, ప్రభాతవార్త**



కడప నగరంలోని యూటీఎఫ్ భవన్ నందు ఆదివారం జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా వార్షిక సమావేశం అధ్యక్షులు రావుపై బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ప్రొఫెసర్ వెంకట రామిరెడ్డి మరియు కప నగరంలోని ప్రముఖ వైద్యులు ప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ హాజరయ్యారు. ప్రొఫెసర్ నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆశయాలను ముందుగా జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు పాటిస్తూ సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక అంటే గిట్టని వారు కొంత మంది వ్యతిరేక ప్రచారాలు నిర్వహిస్తున్నారని అలాంటివి ఏమీ పట్టించుకోవద్దన్నారు. మూఢనమ్మకాల నిరోధ చట్టాన్ని అమలు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవదత్తం, సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షులు బాలు గారి వెంకట సుబ్బయ్య, కార్యదర్శులు సుజన్‌కుమార్, ఉషారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు, రంగనాయకులు, వివిధ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా మార్పులేని గిరిజనుల బతుకులు

**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త**



గత 30 సంవత్సరాల క్రితం జిల్లాలోని చిట్టచివరి మండలం అయిన శ్రీ అవధూత కాశినాయన మండలం వరికుంట్ల ఎస్టీ కాలనీ ప్రజలకు సమీపంలో అటవీ ప్రాంతానికి ఆమడ దూరంలో ప్రభుత్వం కాలనీ వాసుల నివాసం కోసం 33 కుటుంబాలకు గృహాలు నిర్మించుకునేందుకు స్థలం కేటాయించి అక్కడ ఎస్టీ పిల్లల విద్యాభివృద్ధి కోసం మినీ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో స్కూల్ భవనం ఉంది కానీ అంగన్వాడికే పరిమితమైంది. ఇక్కడికి ఏ ఒక్క అధికారి వచ్చిన దాఖలాలు లేవు. మా వద్దకు టీచర్లు రారు అధికారులు రారు వైద్య శాఖ వారు రారు ఉపాధి హామీ పనులు జరగవు నేటికీ 30 ఏళ్లు దాటిన కనీస సౌకర్యాలు కూడా నోచుకోని గ్రామం మాదే అంటూ గిరిజనులు వాపోతున్నారు. బ్యాంకులో పొదుపు కట్టుకోవాలన్న లోన్లు తెచ్చుకోవాలన్న మాకు అవకాశాలు లేవని మేము సమాజంలో ఏమీ పొందలేనివారంగా నిస్సహాయ స్థితిలో జీవనం కొనసాగిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మాకు త్రాగునీటి వసతి లేదు జ్వరం వచ్చిన ప్రమాదవశాత్తు ఏవైనా ప్రమాదాలు జరిగితే వైద్యశాలకు వెళ్లాలంటే కనీసం గంట టైం పడుతుంది ఇవే కాకుండా మా పిల్లలకు చదువు లేదు మేము ప్రభుత్వం మాకు ఇచ్చిన భూముల కు పట్టాలిచ్చారు పాసుబుక్కులు లేవు ఆన్లైన్ నందు నమోదు కాలేదని తెలిపారు. 30 ఏళ్లు గడిచిన మా గురించి ఎవరూ పట్టించుకోలేదు కనీసం మా మా పిల్లల జీవితాల్లోనైనా వెలుగు నింపండి అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇటీవల బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకటరమణ ఎస్టీ కాలనీని సందర్శించి కాలనీ అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులతో అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరి 30 ఏళ్లుగా రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామ మండల రాజకీయ నాయకులు పలు పార్టీల ప్రతినిధులు ఎస్టీల జీవితాల గురించి ఆలోచించక పోవడం బాధాకరమైన విషయం ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఎస్టీ కాలనీ పై దృష్టి నిలిపి కాలనీ అభివృద్ధికి అవసరమైన త్రాగునీరు విద్య ఉపాధి సౌకర్యాలతో పాటు వారి భూములు తయారు చేసుకునేందుకు పంటలు పండించుకునేందుకు వారికి అవసరమైన పట్టాదారు పాసు బుక్కులు వారి భూములు ఆన్లైన్ నందు నమోదు చేసి గిరిజనులను అభివృద్ధి వైపు నడిపించాలని ఆశిస్తున్నారు.

## ధన్యజీవి జింకా వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త



చేనేత పరిశ్రమ కోసం పరితపించి జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి జింకావెంకటసుబ్బయ్య అని జాతీయ ఐక్యవేదిక కన్వీనర్ అల్లారు మల్లికార్జున అన్నారు. ఆదివారం ఉదయం 10గంట లకు పద్మశాలి కళ్యాణ మండపంలో జరిగిన జింకావెంకట సుబ్బయ్య శతజయంత్యోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమపటిమతో జింకావెంకటసుబ్బయ్య రాష్ట్ర నాయకుల ప్రశంసలు పొంది గుంతకల్లు,చీరాల, మంగళగిరి, రాజమండ్రి నాలు మిల్లులకు డైరెక్టర్ గా, వైస్ చైర్మన్ గా సేవలందించారని అన్నారు. చేనేత వస్త్రవ్యాపారి పల్లాశేషయ్య మాట్లాడుతూ జింకావెంకట సుబ్బయ్య జన్మదినోత్సవాలను కుమారులు కలిసి చేయడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ ఏడు దశా బ్దాల నాటి చేనేత ఉద్యమఘట్టాలను స్మరించి స్ఫూర్తి పొందడానికే ఈసభ లో ఓ పుస్తకాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ లక్ష్మి నరసయ్య, డాక్టర్ చెంద్రాయుడు, కరుమూరు వెంకటరమణ, సాదు గోపాల కృష్ణఎసి దస్తగిరి,భాస్కరరాజు పాల్గొన్నారు. తొలుత రక్తదాన శిబిరం నిర్వహించారు.

## రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 29, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి జగన్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాచ మల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆది వారం ఉదయం స్థానిక 37 వ వార్డు లో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి వైసిపి నాయకులు భీమునిపల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి నిరుపేదల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఘనత ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. పురపాలక సంఘ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కాలువలు రోడ్లు త్రాగునీరు కల్పించేం దుకు ఇప్పటికే 70 కోట్ల రూపాయలు పనులు జరిగాయన్నారు ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ కార్య క్రమంలో వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్ కాటం రామకృష్ణ వద్ది రమ ణమ్మ కౌన్సిలర్లు ఇర్ఫాన్ భాష జిలాని కమల్‌భాష దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహారావు రాయపరెడ్డి మార్తల గురుమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు ఆగస్టు 29, ప్రభాతవార్త

పట్టణంలోని 20వ వార్డు స్థానిక కొత్త మార్కెట్ లో ఉన్న మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలను 10 రకాలుగా అభివృద్ధి పరిచేందుకు రూ. 42 లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటినుండి విద్యకు పెద్దపీట వేస్తూ నాడు నేడు పథకం ద్వారా మొదటి దఫా ఆరువేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి విద్యాలయాలను ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దారన్నారు పాఠశాలలకు సంబంధించిన ప్రహరీ గోడ బాత్రూములు కుర్చోవడానికి బెంచీలు గ్రీన్ బోర్డులు పాఠశాల మరమ్మత్తులు లాంటి 10 రకాల పనులను చేపట్టి అభివృద్ధి చేశారన్నారు. ప్రొద్దుటూరు నియోజక వర్గం లో ఇప్పటికే 35 కోట్ల రూపాయలతో నాడు నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాలను అభివృద్ధి చేయడానికి 42 లక్షల రూపాయల విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి సహకరించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ వేములపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్ నాగేంద్రారెడ్డి వరుకుటి ఓబులరెడ్డి వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ మాదిగ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహ మంటపాలపై ఆంక్షలు తగవు

### రాయలసీమ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 28, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు వ్యాప్తంగా వినాయక మంటపాలపై ఆరురకాల పర్మిషన్లు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతుందని, ఫైర్ మునిసిపల్, పోలీస్ ,విద్యుత్ లాంటి పర్మిషన్ ల కోసం నిర్వాహకులను తిప్పించుకుంటున్నారని, సున్నితమైన, మత ఘర్షణలను నివారించడానికి కొన్ని నిబంధనలను ఉంచుతారని, కానీ ప్రశాంత మైన ప్రొద్దుటూరులో నిభందనలు సరికాదని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్య క్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రయివేట్ స్థలా ల్లో ఏర్పాటు చేస్తున్న మంటపాలపై కూడా ఆంక్షలు విధించడం సరికాదని, అధి కారులు సిబ్బంది అత్యుత్సాహం చూపవద్దని, కలెక్టర్ చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా చవితి ఉత్సవాలు జరుపుకోవాలి

గోపవరం,ఆగస్టు 28 ప్రభాతవార్త ;



ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆ ది వారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వినా యక చవితి ఉత్స వాల విషయంలో నిభందనలను పాటించాలన్నారు,కమిటీల ద్వారా ఈ కార్యక్రమా లను నిర్వహించుకోవాలన్నారు. ప్రధానంగా మందు బాబులు హద్దు మీరితే కఠిన పచర్యలు చేపడతామన్నారు. అనుమతులు లబించాకే కార్యక్రమాన్ని ప్రారంబించాలన్నారు. రికార్డు డ్యాన్సు వంటి కార్యక్రమాలకు అనుమతులను లేవని చెప్పారు. సమస్యలు లేని హరికతా కాలాక్షేపాలను మాత్రం నిర్వహించుకోవచ్చున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో పోలీసుల నిఘా ఏర్పాటు చేసామన్నారు,అదే విదంగా మండల ప్రజలకు వినాయక చవితి సుభాకాక్షలు తెలిపారు, అనుకోని విదంగా ఏవైనా సమస్యలు ఏర్పడితే వెంటనే తమకు తెలపాలని ప్రజలను కోరారు,

## అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ వ్యయం

## రూ.801కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతుందని ముందే కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకొంటుందో వేచి చూడాల్సిందే. పరిపాలనాపరమైన అనుమతులకంటే ముందు ఆర్థికశాఖ క్లియరెన్స్ లభించాల్సి ఉంది. రాజంపేట ఎంపి, ఎమ్మెల్యే, జడ్‌పి ఛైర్మన్‌లు అన్నమయ్య ప్రాజెక్టు పునిర్నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి తీసుకొనిపోయేందుకు చొరవ చూపాల్సి ఉంది. ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసిన తర్వాతే డిపిఆర్‌కు టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఒకవైపు డిపిఆర్ టెండర్లు, ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు ఇతర టెండరు ప్రక్రియ పూర్తి చేసేందుకు కనీసం నెల రోజులు తక్కువ సమయం పట్టదు. కనీసం నెల రోజులు పడుతుంది. ఇప్పటికే ఎర్త్‌డ్యామ్ కొట్టుకుపోయి 9 నెలలు పూర్తయ్యింది. అంటే ఒక్క సీజన్ పూర్తిగా రైతులు కోల్పోయారు. ప్రాజెక్టు నిర్మాణానికి కనీసం యేడాది నుంచి యేడాదన్నర పట్టే అవకాశం ఉంది. అంటే అన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తేగాని వచ్చే ఎన్నికల నాటికి ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం లేదు. వీటన్నింటి దృష్ట్యా జగన్‌సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది.

## రాయలసీమలో లయన్స్ క్లబ్ సేవలు విస్తృత పరుస్తాం

### లైన్స్‌క్లబ్ ఇన్స్టలేషన్ అధికారి విజయకుమార్‌రాజు

### లైన్స్‌క్లబ్ 316 డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త



లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల్లో సేవా కార్యక్రమా లను మరింత విస్తృత పరుస్తామని లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయ కుమార్ రాజు తెలిపారు. స్థానిక శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం డిస్టిక్ గవర్నర్ లయన్ జెఆర్ ప్రకాశరావు అధ్యక్షతన 5వ జిల్లా గవర్నర్ కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్స్టాలేషన్ అధికారి విజయ్ కుమార్ రాజు 316 జెలయన్స్ జిల్లా 2022-23 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ గవర్నర్గా లయన్ జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్ రావు, ఒకటవ వైస్ డిస్టిక్ గవర్నర్గా వై నాగేశ్వరరావు యాదవ్, రెండవ వైస్ డిస్టిక్ గవర్నర్గా ఎం గౌతమ్ లను నియమించారు. 316 జె లయన్స్ జిల్లా గవర్నర్గా రామచంద్ర ప్రకాష్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, గతంలో 5 జిల్లాలుగా ఉన్న డిస్టిక్ గవర్నర్ పదవి జిల్లాల విభజన కారణంగా నేడు 8, జిల్లాలకు విస్తరించిందని, ఎనిమిది జిల్లాల మొట్టమొదటి డిస్టిక్ గవర్నర్గా రామచంద్ర ప్రకాశరావు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో లైన్స్ క్లబ్ తరపున ఒక బ్లడ్ బ్యాంక్ అవసరమని అందుకు దాతలు 25 లక్షలు చెల్లిస్తే తనవంతుగా 75 లక్షలు రూపాయలు అందిస్తానని, కోటి రూపాయలతో ఒక బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కడపలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ నెలకొల్పేందుకు నిర్ణయించా మన్నారు. ప్రొద్దుటూరు వాసి డిస్టిక్ గవర్నర్గా నియమించిన ప్రకాష్ రావు రాయలసీమ ప్రాంతంలో మరింత మెరుగైన సేవలు అందించి లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన ఆకాంక్షించారు. జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్ రావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి న లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316జె గవర్నర్గా ఎన్నికై నేడు క్యాబినెట్ ఇన్స్టలేషన్ ప్రోగ్రాం నిర్వహించామని,1917 సంవత్సరంలో బెర్లిన్ జోష్ అనే మహానుభావుడు లయన్స్ ఇంటర్నేషనల్ ఏర్పాటు చేశారని అది ఇప్పుడు 210 దేశాల్లో విస్తృత సేవలు అందిస్తున్నదన్నారు. ల యన్స్ ఇంటర్నేషనల్ అతిపెద్ద సేవ సంస్థగా భారత దేశంలోనే విరాజిల్లుతున్న ఏకైక సంస్థని, ఏ సేవాసంస్థకు లేని సభ్యత్వం యునైటెడ్ నేషనల్డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ కు ఉందన్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ స్ఫూర్తితో ప్రేమతో సేవ అనే నిదానంతో ముందుకు వచ్చి, ప్రజలను సేవా తత్పరులను చేసి సేవలందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుసెట్టి రామ్మోహన్రావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ పశుపుల సుబ్రహ్మణ్యం, కోశాధికారి కామిశెట్టి కృష్ణమూర్తి, సెక్రటరీ నిచ్చెన మెట్ల సత్యనారాయణ, అదనపు కోశాధికారి జూటూరు పద్మ నాభయ్య, పరిపాలనాధికారి తృప్తి ప్రసాద్ రావు, లైన్స్ క్లబ్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్యులు పలు జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సదస్సును జయప్రదం చేయండి

### జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్

ప్రొద్దుటూరు ఆగస్టు 29, ప్రభాతవార్త



కడపలో సెప్టెంబర్ 4 ఆది వారం నిర్వహించే రాష్ట్రస్థాయి స్కీం వర్కర్లు ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సదస్సును జయ ప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్ ఏపీ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి సుభాషిని, కామనూరు సెంటర్ అధ్యక్షురాలు కరుణామణి, కళావతి లు ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఆవరణంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే గాక వెట్టి చాకిరి చేయించుకుంటుందని తక్షణం ఆశా కార్యకర్తల వేతనాలు పెంచి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో కరోనాను కట్టడి చేయడానికి ప్రాణాలకు తెగించి పనిచేయడం జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి లిగ్లోబల్ హెల్త్ లీడర్స్‌లి అనే బిరుదును ఆశా కార్యకర్తలకు ఇచ్చిందని తెలిపారు. కరోనాతో మరణించిన ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సుకు జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు పోలమ్మ, శ్రీదేవి, అనసూయ, లక్ష్మి, రాధిక, స్వర్ణలత, నాగజ్యోతి, మేరీ, సువార్తమ్మ, కళ్యాణి, జ్యోష్ణ దేవి, మహబూబ్ జాన్, నాగలక్ష్మి, జి ప్రభావతి, జీ నాగలక్ష్మి, రహమతున్నీసా, హిమబిందు, రంగమ్మ, సుజాత, శ్రీ వాణి, బాలనాగమ్మ, పుష్పలత, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి

కడప వైద్య విభాగం, ఆగస్టు 28, ప్రభాతవార్త



కడప నగరం మద్రాసు రోడ్డులోని అశోక హోటల్, అశోక లాడ్జీ ఉత్తరం వైపు ఖాళీ జాగాలో సగం కొనుగోలు చేశామని, ఆస్తి హక్కుదారులు వెంటనే తమకు రిజిస్ట్రేషన్ చేయించాలని కొనుగోలు దారుడు పి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ 2020 జనవరి 21వ తేదీన మద్రాసు రోడ్డులోని అశోక హోటల్, లాడ్జీ ఉత్తరం వైపు ఉన్న 18/1 సర్వే నెంబరులో ఖాళీ స్థలంలో సగ భాగం కామిశెట్టి రామాంజనేయులు తమకు అమ్మారని తెలిపారు. కడప వైవీ స్ట్రీట్‌లోని డోర్ నెంబరు 17 51 కామిశెట్టి రామాంజనేయులు అనేక వ్యక్తి దగ్గర నుంచి పెండ్లిమర్రి మండలం చీమలపెంట గ్రామ నివాసం అయిన తాను కొను గోలు చేశాననని తెలిపారు. అదే రోజు 1/4వ భాగం డబ్బులు ఇచ్చి అగ్రి మెంటు రాయించుకున్నానని మరలా ఆరు నెలలకు కొంత మొత్తం ఇచ్చాని, మరలా ఆరు నెలకు మిగిలిన డబ్బులు ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. అయితే మిగతా డబ్బులు తాను సమకూర్చుకుని రిజిస్ట్రేషన్ చేయించాలని వారిని కోరగా కాల యాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆస్తిహక్కుదారులు కామిశెట్టి శివ ప్రసాద్, కామిశెట్టి రవికుమార్ మిగతా డబ్బులు తీసుకొని హోటల్ అశోక లాడ్జీ ఉత్తరం వైపు ఉన్న ఖాళీ జాగా తమకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

## బికాం 6వ సెమిస్టర్‌లో హెలెన్‌కెల్లర్ బధిరుల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత

కడప ఆగస్టు 28, ప్రభాతవార్త



బి. గిరిప్రసాద్



జి. నందిని

హెలెన్‌కెల్లర్ బధిరుల కళాశాల, కడప చెవిటి, మూగ విద్యార్థులు యోగి వేమన విశ్వఇద్యాలయం విడుదల చేసిన 6వ సెమిస్టర్ పరీక్షల్లో వందశాతం ఉత్తీ ర్ణత సాధించినట్లు కళాశాల కరస్పాం డెంట్ దౌలత్‌ఖానన్ ఒక ప్రకటనలో తెలి పారు. పరీక్షలకు హాజరైన 14మ ంది ఉత్తీ ర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. వీరి లో బి. గిరిప్రసాద్ 7.37 మార్కులు, జి. నందిని 7.25 శాతం మార్కులతో కళాశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచా రని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మసుద బేగం అభినందించారు.

## కూరగాయల సంత మంగళవారానికి మార్పు

గాలివీడు, ఆగస్టు 28ప్రభాతవార్త:

వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం జరగాల్సిన వారాం తపు కూరగాయల సంతను మంగళవారానికి మార్చినట్లు గుత్తేదారు గంగాధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ దృష్ట్యా వ్యాపారస్తులు, కొనుగోలు దారుల సౌకర్యార్థం మంగళవారానికి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో యధావిధిగా బుధవారం సంత కొనసాగుతోందన్నారు.

## బషీర్‌బాగ్ విద్యుత్తు ఉద్యమానికి 22 ఏళ్లు

జమ్మలమడుగు, ఆగస్టు 28, ప్రభాతవార్త



2000 సంవత్సరంలో ఆగస్టు 28న విద్యుత్తు రంగంలో వినాశకర సంస్క రణలు వ్యతిరేకిస్తూ సాగిన మహోద్యమం లో అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్, రామకృష్ణలకు జమ్మలమడుగులోని పాత బస్టాండు నందు సీపీఎం పార్టీ ఆధ్వ ర్యం లో సంతాప సభలో వారికి నివాళులు అర్పిస్తున్నట్లు సీపీఎం పార్టీ పట్టణ కార్య దర్శి వీరణాల శివనారాయణ అనంతరం అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్, రామకృష్ణల చిత్రపటాలకు వారు పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. శివనారాయణ మాట్లాడుతూ దేశంలో నయా ఉదారవాద, ఆర్థిక విధా నాలు అమలు చేయడంలో విద్యుత్తు రంగ సంస్కరణలపైనే పాలకుల ప్రధాన దృష్టి ఉంటూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు సంస్కరణ లను వేగ వంతం ఏయడానికి విద్యుత్తు రంగంలో ప్రైవేటు డిస్కంలు తేవడానికి కేంద్రం శతవిధాలా కుట్రలు చేస్తోందన్నారు. ప్రభుత్వాలు వేస్తున్న భారాలను వ్యతి రేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలను పోరాటాలను ఉదృతం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హుసేన్‌వలీ, బాషా, దివాకర్, మన్సూర్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటు పడదాం : డీవైఎఫ్ఐ

జమ్మలమడుగు, ఆగస్టు 28, ప్రభాతవార్త



ప్రజలందరం పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడదామని కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేద్దామని జమ్మల మడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని పర్యావర ణాన్ని పరిరక్షించాలని పోస్టర్లను ఆదివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గణపతి పండగను పుర స్కరించుకొని ప్రజలందరూ ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్‌ను నివారించి పర్యావరణను పరి రక్షించే మట్టి గణపతి విగ్రహాలను అందరూ ప్రతిష్టించాలని ఆయన సూచిం చారు. డీవైఎఫ్ఐ యువజన సంఘం వారికి అభినందనలు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ యువజన సంఘం ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటామన్నారు. ఈ కార్య క్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మన్సూర్, దివాకర్ పాల్గొన్నారు.

## ఏపీజీబీ సేవలు వినియోగించుకోండి..

పెండ్లిమర్రి, ఆగస్టు 28, ప్రభాతవార్త



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ డిపాజిట్ల సేకరణలో భాగంగా డిపాజిట్లపై అన్ని బ్యాంక్‌ల కన్నా అత్యధిక వడ్డీ మన బ్యాంక్ ఇస్తోందని ఏపీజీబీ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్తగా సిరి-666 మరియు సిరి-400 అని కొత్త డిపాజిట్ ప్రొడక్ట్స్ విడుదల చేశామన్నారు. వీటిలో డిపాజిట్ చేస్తే సాధారణ ఖాతాదారులకు 6.1% మరియు 60 ఏళ్ల పైబడిన వారికి 6.7% వడ్డీ వస్తుం దని, సిరి-400 అనగా 400 రోజుల డిపాజిట్ చేస్తే సాధారణ ఖాతాదారులకు 6%, మరియు 60 ఏళ్ల పైబడిన ఆడవారికి 6.6% వడ్డీ వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా ఆడవారికి అదనంగా 0.05% వడ్డీ వస్తుందని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు..

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 28, ప్రభాతవార్త



ఉపాధ్యాయులు తలపెట్టిన పీఆర్సీ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు ఎర్రగుంట్ల ఎస్సై నరసయ్య తన సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహిం చారు. ప్రయాణికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ముంద స్తు గా రిజర్వేషన్ చేసుకున్నారా లేక ఉద్యమం కోసం వెళ్తున్నారా అన్న కోణంలో ఆరా తీశారు. రైల్వే అధికారులతో మాట్లాడి వారి నుంచి వివరాలు సేకరించారు.

## వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 28, ప్రభాతవార్త



వినాయక చవితిని నిర్వాహకులు అత్యంత భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని ప్రొద్దుటూరు టు టౌన్ సీఐ ఇబ్రహం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన చవితి సమావేశం ఆది వారం ఏర్పాటు చేశారు. పండగను శాంతి యుతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా చూడాలన్నారు. విగ్రహం వద్ద డీజేలు నిర్వహించడం, అధిక సౌండ్ సిస్టం వాడి ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదని హెచ్చరించారు. విద్యుత్తు వైర్ల విషయం జాగ్రత్తలు తీసుకోవాలని ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు వహిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వినాయక చవితి నిర్వా హకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

### సంజీవని హాస్పిటల్ గైనకాలజిస్ట్ డా॥ పవిత్ర

బద్వేలు అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త



బద్వేలు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ బద్వేలు ప్రాంత ప్రజల మన్ననలు పొందిన సంజీవని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్స వం పురస్కరించుకొని ఆదివారం అడా ఛైర్మెన్ సింగసాని గురు మోహన్, మున్సి పల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు చేతుల మీదుగా హాస్పిటల్‌లో ఎక్స్-రే, గైనకాలజీ గది, జనరల్ వార్డులను ప్రారంభోత్స వం చేశారు. ప్రారంభోత్స వానికి హాజరైన పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులకు సంజీవని హాస్పిటల్ డా॥ కోటా సుమన్, వై.వి.సరస్వతి, గైనకాలజిస్ట్ డా॥ సముద్రాల పవిత్ర సాదరం గా ఆహ్వానం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం అడా ఛైర్మెన్ సింగసాని గురు మోహన్ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో సంజీవని హాస్పిటల్ ఏర్పాటు చేసి అనతి కాలంలోనే పలు రకాల ఉచిత మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం సంతోషకరం అన్నారు. అనంతరం మున్సి పల్ వైస్ ఛైర్మెన్ సాయికృష్ణ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో కుల, మతాలకు అతీతంగా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో డా॥ కోటా సుమన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు మాట్లాడుతూ ఆర్యవైశ్య ప్రముఖులు ఎస్.వి.సుబ్బారావు కుమార్తె ఉన్నత చదువులు చదివి గైనకాలజిస్ట్‌గా సంజీవని స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రజలకు వైద్య సేవలందించేందుకు అందుబాటు లో ఉండడం సంతోషకరం అన్నారు. సంజీవని హాస్పిటల్ డా॥ కోటా సుమన్, వై.వి.సరస్వతిలు మాట్లాడుతూ తాము బద్వేలు ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికి అనేక దఫాలుగా పలు రకాల వ్యాధులకు సంబంధించిన అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించామన్నారు. ఈ కార్యక్రమంలో లివా ఫౌండేషన్ వైస్ ఛైర్మెన్ గాజుల నరసింహులు (బాబు), ఆవులేటి శేఖర్ రాయల్, కౌన్సిలర్ చెన్నయ్య, పద్మనాభం, పెంచలయ్య స్వామి, సముద్రాల పుల్లయ్య, దుద్యాల సత్యం, సగళా వెంకట సుబ్బరాయుడు, దర్శి వెంకట సుబ్బయ్య మరియు హాస్పిటల్ సిబ్బంది, పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓల భర్తీ ఏకగ్రీవం

### - ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 28, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈఓ ఖాళీలు ప్రభుత్వ యాజమాన్య హెచ్‌ఎంలచే భర్తీ చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే గొడుకు కిందికి తెస్తామని గొప్పలు చెప్పుకునే ఈ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం అన్యాయ మన్నారు. ఏకీకృత సర్వీస్ నిబంధనలతో లోకల్ కేడరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ప్రకారం ఇరు యాజమాన్య ఉపాధ్యాయులూ ఎంఈఓ పదోన్నతులకు అర్హులే నన్నారు. కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అమలు చేయకపోవడం వల్లే న్యాయస్థానం పరిధిలోకి వెళ్లిందన్నారు. 30 ఏళ్ల నుంచి ఉన్న సమస్యను ఇప్పటికైనా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఉమ్మడి రైల్స్‌కై ప్రత్యేక చర్యలు చేపట్టి కామన్ సీనియారిటీ తయారు చేసి ఎంఈఓ జేఎల్‌డీవైఈవో ఖాళీలు పదోన్నతులతో నింపాలని కోరారు. ఉపాధ్యాయుల మధ్య చిచ్చు ఆపాలని కోరారు.

**అన్యాయపు నిర్బంధాలు ఆపాలి**

ఓపీఎస్ సాధన కోసం సెప్టెంబరు 1న జరగనున్న ఉద్యమాన్ని నీరు కార్చడం కోసం ఉపాధ్యాయులను నిర్బంధాలకు గురి చేయడం పిరికిపంద చర్య అని సీవీ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకొంటే ఈ పరిస్థితి ఉంటుందా అన్నారు. తక్షణం సీపీఎస్ రద్దు చేయాల్సిందేనన్నారు. లేకపోతే సెప్టెంబరు 1న ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుందన్నారు. ఇవ్వలేప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు.

## ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా..

కమలాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త



ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా నని, మీకు ఏ అవసరం వచ్చినా నా వద్దకు వస్తే సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మసీదు నిర్మాణానికి స్థలం కావాలని తమ పార్టీ ముస్లిం నాయకులు రాగానే అధికారులకు చెప్పి స్థలం కేటాయించా నన్నారు. మసీదు నిర్మాణంలో తన పాత్ర ఉండడం దేవుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నాన్నారు. అలాగే ఖబరస్తాన్‌కు కూడా స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు మహ్మద్ సాదిక్, హిదయత్, గఫార్, ఖాజా హుసేన్, ఖాజాపీర్, మోనార్క్, జావీద్, షావలీ, జిలానీ, షారూక్ ఖాన్, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నాసిర్ హుసేనీ, పట్టణంలోని అన్ని మసీద్‌ల పేష్ ఇంమాలు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

### - చిన్నచెప్పలిలో బాదుడే బాదుడులో తెదేపా నాయకులు

కమలాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలా పురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం చిన్నచెప్పలి పంచాయతీలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులకు మహిళలు గ్రామ ప్రజలు తాగునీరు లేక కలుషిత నీరు తాగి ఇబ్బందులు పడుతున్నామని, చిన్న పిల్లలకు, వృద్దులకు విష జ్వరాలు ప్రభులు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మాకు మంచినీరు సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని తెదేపా నాయకులు హామీ ఇచ్చారు. చిన్నచెప్పలిలో అధికార పార్టీ నాయకులు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కనీసం తాగునీటి సమస్యను కూడా పరిష్కరించకుండా పాలన సాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు తగ్గాలంటే, ప్రజల సమస్య లు తొలగాలంటే చంద్రబాబునాయుడు సీఎం అయితే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు అంకిరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, తెదేపా మాజీ అధ్యక్షులు దివాకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఆసుపత్రి మాజీ ఛైర్మన్ నరసింహారెడ్డి, కాపు నాయకులు దాదిరామయ్య, మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

ములకల చెరువు, ఆగస్టు 28, ప్రభాతవార్త



ములకల చెరువు మండలం, కోనేటి వారి పల్లె పంచాయతీ దాశెట్టివారి పల్లెలో గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విష యం తెలుసుకున్న సర్పంచ్ జయచంద్ర కుమార్ ఆదివారం రెండు లక్షల రూపాయల విలువ గల నూతన తాగునీటి సమస్య తీర్చారు. గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రమేష్, మెకానిక్ సుబ్బారెడ్డి, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితురాలు అరెస్ట్

ములకల చెరువు, ఆగస్టు 28, ప్రభాతవార్త



ములకల చెరువు మండలం, దేవుల చెరువు పంచాయతీ గొల్లవారిపల్లికి చెందిన శ్రీనివాసులు (32) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసుకు సంబంధించిన నిందితులు వేణు గోపాల్, శంకర్లను ఇప్పటికే ములకల చెరువు పోలీసులు అరెస్టు చేశారు. అయితే మూడో నింది తురాలు హత్యకు గురైన శ్రీనివవాసులు భార్య శోభారాణిని ఆదివారం అరెస్టు చేసి అదుపు లోకి తీసుకున్నారు. వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను హతమార్చేందుకు తోడ్పడిన శోభారాణి బెంగళూరుకు వెళ్లేందుకు ఉద యం 11 గంటలకు వేపూరుకోట బస్టాండు నందు ఉండగా సమాచారం అందు కున్న ఇన్‌ఛార్జి సీఐ శివాంజ నేయులు, ఎస్సై డి.వై.స్వామిలు సిబ్బందితో వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితురాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## గుట్కా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 28, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు టౌన్, సంజీవ నగర్‌లోని పెద్ద గుంత వద్ద పల్లె రవీంద్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తుండడంతో అతన్ని అరెస్టు చేసి నట్లు టుటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.ఇబ్రహీం తెలిపారు. ఆయన వివరాల మేరకు తమ సిబ్బందికి ముందుగా రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.5వేలు విలువ చేసే గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిం దన్నారు.

## 300 లీటర్లు సారా ఊట ధ్వంసం

ములకల చెరువు, ఆగస్టు 28, ప్రభాతవార్త



ములకల చెరువు ఎస్ఈబీ కార్యా లయం పరిధిలో నిర్వహించిన దాడుల్లో భారీగా సారా ఊట ధ్వంసం చేసినట్లు ములకల చెరువు ఎస్ఈబీ సీఐ మల్లికా తెలిపారు. సీఐ మల్లికా కథనం మేరకు వివ రాలు ఇలా ఉన్నాయి. పెద్దమండెం మండలం లోని రామానాయక్ తాండాలో నిర్వహించిన దాడుల్లో 300 లీటర్లు సారా ఊట ధ్వం సం చేసినట్లు తెలిపారు. ఎవరైనా తాండాల్లో సారా కాచినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఆధారంగానే ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలి

– యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్

బద్వేలు అర్బన్, ఆగష్టు 28 ప్రభాతవార్త :



ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు భిన్నంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులకు కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ హెడ్మాస్టర్లతోనే భర్తీ చేయడం సరి కాదని, పంచాయతీరాజ్ హెడ్మాస్టర్లకు కూడా అవకాశం కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూలై 26న ముఖ్యమంత్రి సమక్షంలో విద్యాశాఖపై జరిగిన రివ్యూలో ఎంఈవో ఖాళీలను హెడ్మాస్టర్లతో భర్తీ చేయాలనే నిర్ణయం జరిగినట్లు, కాబట్టి ఖాళీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హెడ్మాస్టర్లతో భర్తీ చేయాలని వెబెక్స్ మీటింగ్‌లో పాఠశాలల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పిన మేరకు ఈ ఖాళీలు భర్తీ చేస్తున్నామని అధికారులు చెప్పడం ఉమ్మడి సర్వీస్ రూల్స్ విధానానికి తూట్లు పొడినట్లేనని అన్నారు. ప్రభుత్వ వైఖరి వల్లే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పంచాయతీరాజ్ టీచర్లు ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య గత 3 దశాబ్దాలుగా కోర్టుల పరిధిలో ఉండిపోయిందన్నారు. రాష్ట్రపతి అనుమతి ఇచ్చినప్పటికీ ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి సమస్య పరిష్కారం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో ఆయా పోస్టులు లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ సమస్య పరిష్కారం చేయాలని, ఉమ్మడి సీనియారిటీ ఆధారంగానే పదోన్నతులు గాని, ఎఫ్ఎస్‌సిలుగాని ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శశిధర్ కుమార్, గోపవరం మండల అధ్యక్షులు వీరదాసరి క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబైన వినాయక విగ్రహాలు

బద్వేలు రూరల్, ఆగష్టు 28 ప్రభాతవార్త :



గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా ముందస్తుగానే వినాయక స్వామి విగ్రహాలను రంగు రంగులతో అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. రోడ్డు ప్రక్కనే వాహనదారులను, చూపరులను ఆకట్టుకునే విధంగా వినాయక విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. కోవిడ్ దృష్ట్యా గత 2 సంవత్సరాలు పండుగలకు దూరంగా ఉన్న ప్రజలు ఈ ఏడాది వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు విద్యుత్‌ద్వీపాలు, చలువ పందిర్ల వివిధ రకాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## టిఎన్ఎస్ఎఫ్ నాయకుల అరెస్టులను ఖండిస్తున్నాం

సంబేపల్లి, ఆగస్టు 28ప్రభాతవార్త:



విద్యార్థి వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకుల అరెస్టులను ఖండిస్తున్నామని ఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి సాయికుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం సంబేపల్లిలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల ద్వారా విద్యా వ్యవస్థ భ్రష్ట పట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా విశాఖ పట్టణం వేదికగా తలపెట్టిన 'విద్యా ఆగ్రహ దీక్షకు ముందస్తుగా అన్ని అనుమతులు కోరామన్నారు. జగన్‌రెడ్డి ఆదేశానుసారం పోలీసులు అక్రమంగా ధర్నా చౌక్‌లో దీక్ష చేయకుండా ఎపి టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. ప్రణవ్ గోపాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం నీతిమాలిన చర్య అన్నారు. వ్యతిరేక విధానాలను ప్రభుత్వం ఆపకుంటే ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

## క్రికెట్ బెట్టింగ్‌పై చర్యలు ఉండవా?

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో క్రికెట్ బెట్టింగ్‌పై చర్యలు ఉండవా? అంటూ బెట్టింగ్‌లో నష్టపోయిన వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో క్రికెట్‌బెట్టింగ్ ఆడి కొన్ని కుటుంబాల్లో విషాద సంఘటనలు జరిగిన విషయం విధితమే. ముఖ్యంగా క్రికెట్ క్రీడపై ఎంతోమంది ఇంటిలోని సొమ్ములు దారాదత్తం చేసి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని, వీరిని కట్టడిచేయాలని పట్టణంలో భారీగా ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌బెట్టింగ్‌లో ప్రాణాలు తీసుకొన్న సందర్భాలు ఉన్నాయని, శనివారం రైల్వేకోడూరు పట్టణంలోని పాతబజారుకు చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి ఇంటిలోనివారికి సమాధానాలు చెప్పలేక రైలుకింద పడి మృతిచెందిన సంఘటన తెలిసిందే. రైల్వేకోడూరు పట్టణంలో క్రికెట్, మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై అన్నమయ్య జిల్లా ఎస్‌పి రైల్వేకోడూరు మండలంలో ప్రత్యేక దృష్టి సారించి అరాచకశక్తుల ఆటకట్టించాలని కోరుతున్నారు.

## బషీర్‌బాగ్ విద్యుత్తు ఉద్యమ స్ఫూర్తితో మోదీ నూతన విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడదాం

– సీపీఎం జిల్లా కార్యదర్శి ర్గ సభ్యులు బి.మనోహర్, ఐఎన్.సుబ్బమ్మ

కడప వైద్య విభాగం, ఆగస్టు 28, ప్రభాతవార్త:



2000 సంవత్సరంలో ఆగస్టు 28న విద్యుత్తు రంగంలో వినాశకర సంస్కరణలు వ్యతిరేకిస్తూ సాగిన మహోద్యమంలో అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్, రామకృష్ణలకు ఆర్కేనగర్‌లోని విద్యుత్తు భవన్‌లో సంతాప సభలో వారికి నివాళులు అర్పిస్తున్నట్లు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఐఎన్.సుబ్బమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నయా ఉదారవాద, ఆర్థిక విధానాలు అమలు చేయడంలో విద్యుత్తు రంగ సంస్కరణలపై నేపాలకుల ప్రధాన దృష్టి ఉంటూ వస్తోంది. ఈ తరుణంలోనే ఆనాడు 2000 సంవత్సరం ఆగస్టు 28న అప్పటి తెదేపా ప్రభుత్వం వినాశకర విద్యుత్తు సంస్కరణలు తీసుకువచ్చింది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు, విద్యుత్తు ఇంజినీర్లు వినియోగదారులు అనేక ప్రాంతాల్లో ఉద్యమించారు. ప్రభుత్వాలు వేస్తున్న భారాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలను పోరాటాలను ఉదృతం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు వినియోగదారులకు ట్రూప్ ఛార్జీల పేరుతో అధిక భారాలు మోతున్నారని ఇలాంటి భారాలు అధికమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, మహబూబ్‌తారా, ఎమ్మార్ నాయక్, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, మున్ని, అన్వర్, నాయకులు పూజారి, రమణ, రవి, లక్ష్మీదేవి, వెంకటేష్, చెన్నయ్య, సురేష్, వినోద్, స్థానిక ప్రజలు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం రద్దు చేయాలి : సీపీఎం

కడప వైద్య విభాగం, ఆగస్టు 28, ప్రభాతవార్త:

ఢిల్లీ యూనివర్శిటీ మాజీ లెక్చరర్ జీఎన్.సాయిబాబాతో పాటు మావోయిస్టులతో సంబంధాలున్న ఆరోపణలపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)లోని వివిధ సెక్షన్ల కింద దోషిగా తేలిన రాజకీయ కార్యకర్త పాండు నరోటే జైలులో సరైన వైద్యం అందక మరణించడం వ్యవస్థాగత హత్యగా కామనూరు శ్రీనివాసులురెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పత్రికా ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నరోటే అనే 33 ఏళ్ల యువకుడు తన రాజకీయ విశ్వాసాల కారణంగా అతనికి జైలులో ఇవ్వాల్సిన వైద్యం ఇవ్వలేదు. సరిగ్గా ఈ కారణంగానే అతను నాగ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మృతి చెందాడని తెలిపారు. నరోటే మరియు స్టాన్ సామి లాంటి ఉద్యమకారులు జైల్లో వైద్యం అందదక మరణించడానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరిని పరిశీలించడానికి తగిన న్యాయపరమైన పరిష్కారం సూచించడానికి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఒక కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

## నిమ్మనపల్లెలో అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

నిమ్మనపల్లె, ఆగస్టు 28 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన నిమ్మనపల్లె బస్టాండు ప్రాంతంలోని పాపారాయుడు, శ్రీనివాసులు నూతన గృహాల్లో వినాయక చవితి పండుగకు వినాయకుని విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని ప్రతి గ్రామస్తులు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఈనెల 31న బుధవారం వినాయక చవితి పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు.

## కలికిరిలో సద్భావన సదస్సు విజయవంతం

కలికిరి, ఆగస్టు 28 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని ఈద్గా ఆవరణంలో ఆదివారం జమాయిత్ ఉల్మా హే హింద్ ఆధ్వర్యంలో సద్భావన సదస్సు జరిగింది. ఈ సమావేశానికి మండల కేంద్రంలోని పండితులు, హిందూ ఆలయాల అర్చకులు, చర్చిల ఫాదర్‌లు, మసీదుల హజరత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జమియత్‌ఉల్మాహేహింద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్తఫా హజరత్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ హిందూ, ముస్లిం, క్రైస్తవుల అనే బేధాభిప్రాయాలు లేకుండా ఐక్యమత్యం, సోదర బావంతో ముందుకువెళ్ళాలని ఆయన పిలుపునిచ్చారు. పండితులు మాట్లాడుతూ అన్ని మతస్తులు వారు ఎంతో ఐకమత్యంగా వారు జరుపుకొనే పండుగలు, కార్యక్రమాల్లో అందరూ పాల్గొంటూ సోదరభావాలను, ఐక్యమత్యాలను చూపిస్తున్నారన్నారు.కార్యక్రమంలో జాఫర్ హజరత్, కరీముల్లా హజరత్, శివాలయ అర్చకులు రామచంద్రశర్మ,ఎల్లమ్మ ఆలయ అర్చకులు కెవి.రమణ, ఫాస్టర్లు పాల్గొన్నారు.

## వరి పైరు నాట్లపై అవగాహన

– వ్యవసాయాధికారి చంద్రమోహన్ రెడ్డి

బద్వేలు రూరల్, ఆగష్టు 28 ప్రభాతవార్త :



మండల పరిధిలోని తిరువెంగళాపురం పంచాయతీ రైతు భరోసా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయి కిరణ్ పరిధిలో వరి పంట నాటుకునేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పంట నమోదు చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాల గురించి మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్ రెడ్డి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిఎం కిసాన్ ఈకేవైసి ఈ నెల 31వ తేదీ లోపు గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర గాని, మీ సేవ కేంద్రంలో గానీ, సిఎస్‌ఇ కేంద్రంలో గానీ తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య మరియు వ్యవసాయ అధికారులతో పాటు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాత్రేవుడు, స్మశాన స్థలాలకు పరిహారం ఎలా పంపిణీ చేస్తారు

– కార్మిక నాయకుడు సి.హెచ్.చంద్రశేఖర్

ఓబులవారిపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం మంగంపేట రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 8లో ఉన్న కాత్రేవుడు, పశువుల బీడు, స్మశానం స్థలాలను గుర్తించి ప్రత్యామ్నాయంగా గ్రామస్థులకు మరో చోట చూపించి ఆ భూములకు సంబంధించిన రైతులకు పరిహారం ఇవ్వాలే తప్ప గ్రామస్తుల అభ్యంతరాల మేరకు 8 సర్వే నెంబర్ భూమి కోర్టులో ఉన్నప్పటికీ జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు, మండల స్థాయి అధికారులు ఎలా రైతులకు పరిహారం పంపిణీ చేస్తారని ఆయన విమర్శించారు. సంబంధిత అధికారులు అర్హులైన లబ్ధిదారులకు పరిహారం అందించి మంగంపేట గ్రామస్థులు, కాపుపల్లె గ్రామసథ్థులు, పశువుల భూములకు మరో చోట చూపి సర్వే నెంబరు 8 భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## జన వికాస్ సేవా సమితి రాష్ట్ర కమిటీ నియామకం

– జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్

కడప వైద్య విభాగం, ఆగస్టు 28, ప్రభాతవార్త:



కడప నగరంలోని విద్యా సాధన డిగ్రీ కాలేజీలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికలు హేమాహేమీగా జరిగాయి. జనవికాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్ఎండీ తాహిర్, రాష్ట్ర కార్యదర్శిగా యూనిస్ బాషా ఎన్నుకోబడ్డారు.రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా డా.మహబూబ్‌పీర్, డా.సొహైల్ అహ్మద్, రాష్ట్ర కన్వీనర్లుగా మన్సూరలీఖాన్, సీఎస్‌నాసిర్ అలీ, కోకన్వీనర్‌గా వెంకటేష్, ముఖ్య సలహాదారులుగా కాల్‌టెక్స్ మహ్మద్ హఫీజుల్లా, సలహాదారులు రమణ, నూనె నాగేష్, క్రీసెంట్ జిలానీబాషా, సికిందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ జమీర్, రాష్ట్ర డైరెక్టర్ తారిక్ అలీ, రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్‌గా డా.జమాల్‌బాషా తదితరులను ఎన్నుకోవడం జరిగింది.

## డిమాండ్ల సాధన కోసం 1న నల్లబ్యాడ్జీలతో నిరసన

రాయచోటి రూరల్, ఆగస్టు 28ప్రభాతవార్త:




సిపిఎస్ రద్దుతో పాటు ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1వ తేదీన అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట జరగనున్న నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్ యాదవ్, రాయచోటి ఎన్జీవో అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ఎన్జీవో హోంలో విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 1న రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నల్లబ్యాడ్జీలు ధరించి, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి పల్లె ఎన్జీవో అధ్యక్షుడు కె. బలరామరాజు, ఎన్జీవో సంఘం సహాధ్యక్షుడు ఆర్. జయచంద్ర, రాంమూర్తి, విశ్వనాథ్, ప్రతిభ, వరలక్ష్మీ, సహదేవ పాల్గొన్నారు.

## సభ్యుల కమిష్టి కృషితో మానవత సంస్థ సేవలను మరింత విస్తృతం చేద్దాం

రాయచోటి, ఆగస్టు 28ప్రభాతవార్త:



మానవత స్వచ్ఛంద సభ్యుల సమిష్టి కృషితో సేవలను మరింత విస్తరింప చేస్తామని మానవతా చైర్మెన్ అరమాటి శివగంగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రతిభ జూనియర్ కాలేజి లో జరిగిన మానవతా సంస్థ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాన వతా సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి మానవతా సంస్థ గౌరవ సలహాదా రుడు బెల్లం లోకనాథరెడ్డి అల్లుడు జయచంద్రారెడ్డి 25 వేల రూపాయలు, ప్రనముఖ చిన్నపిల్లల వైద్యులు చంద్రశేఖర్ రెడ్డి కుమార్తెలు చందన 25 వేల రూపాయలు నగదును మానవతా సంస్థకు అందజేశారని తెలిపారు. కార్యక్రమం లో మానవత కేంద్ర కమిటీ సభ్యులు సహదేవ రెడ్డి, జిల్లా కమిటి డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి, కో చైర్మెన్ షకీల్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ శ్రీధర్ రెడ్డి, మానవత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బి.కొత్తకోట మండలంలో భారీ వర్షం

– పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు – రాకపోకలకు ఇక్కట్లు

బి.కొత్తకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త :



మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులన్నీ నిండి మొరవలు పోతున్నాయి. పలు మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. మండలంలో శనివారం అర్థరాత్రి నుండి ఆదివారం వరకు భారీ వర్షం కురవడంతో ప్రధాన చెరువులన్నీ నిండి మొరవపోతున్నాయి. గుమ్మసముద్రం చెరువు మొరవ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బి.కొత్తకోట-మదనపల్లి మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు వెళ్లడానికి ఏమాత్రం వీలు కాకపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే మండలంలోని బీరంగి పెద్ద చెరువు నిండి మొరవ పోతుండడంతో శంకరాపురంలోని ప్రధాన రోడ్డుతో పాటు వీధులన్నీ జలమయం అయ్యాయి. పలు దుకాణాల్లోకి, శంకరయ్యస్వామి ఆలయంలోకి నీళ్లు చేరాయి. కర్ణాటక నుండి రంగసముద్రం చెరువుకు వచ్చే బీరంగి ఏరు పరవళ్లు తొక్కుతుండడంతో బి.కొత్తకోట-బెంగళూరు మార్గంలో గాజ్‌వేపై రాకపోకలు స్తంభించాయి. దీంతో బి.కొత్తకోట-బెంగళూరుకు ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి.మండలంలో ఎటు చూసినా వాగులు ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## ఉదారతను చాటుకున్న బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్

బి.కొత్తకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త :



బి.కొత్తకోటలో వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో కన్ను కోల్పోయిన దివ్యాంగుడు హసీన్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. దివ్యాంగుడైన హసీన్ ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ఓ దుకాణం ఎదురుగా ఇనుప సామాన్ల లోడు వేసుకుంటున్న ఆటోపై పడడంతో కన్ను కోల్పోయాడు. బాధితుడికి మానవతా దృక్పథంతో ఎస్ఐ రూ.10వేలును తన సొంత డబ్బును అందజేసి ఆదుకున్నాడు. ఆర్థికసాయం చేసిన ఎస్ఐ రామ్మోహన్‌ను పలువురు అభినందించారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, ఆగస్టు 28 ప్రభాతవార్త :




జాతీయ క్రీడాదినోత్సవంలో బాగంగా స్థానిక జడ్పిహైస్కూల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు ఎన్ఆర్ఆర్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రీడాపోటీలకు ముఖ్య అతిధిగా పాలొన్న ఆర్డీఓ మురళి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు శారీరక దృఢత్వం కలిగి ఉండడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తొన్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలకు బహుమతులును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం రెడ్డన్నశెట్టి, స్పోర్ట్స్ పెడరేషన్ కార్యదర్శి రామ, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, సుధాకర్, రమేష్, ఉపాధ్యాయులు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాకథన్ పోటీలలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త :



జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీలలో మిట్స్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మిట్స్ కళాశాలకుచెందిన బిటెక్, త్రిబుల్ఈ చివరిసంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రపంచంలోనే అతిపెద్ద హ్యాకథాన్‌గా అవతరలించిన కేంద్ర ప్రభుత్వ పోటీలు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2022 లో మొదటి బహుమతిని సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ పోటీల్లో రూ.లక్ష నగదు బహమతిని విద్యార్థులు కైవసం చేసుకొన్నట్లుతెలిపారు. ప్రతి ఏటా న్యూఢిల్లీలోని ఏఐసిటిఈ జాతీయ స్థాయిలో స్మార్ట్ ఇండియా హ్యాకథన్‌ను నిర్వహిస్తారని ఇందులో మనదేశంలోని ప్రముఖ కంపెనీలు టెక్నాలజీపరంగా జరుగుతున్న కొన్ని ప్రాజెక్టుల్లోని సమస్యలను ఇందులో విద్యార్థులకు ఇస్తారని ఈ సమస్యలను పరిష్కరిస్తే ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఈ నగదు బహుమతులను అందజేస్తారని ఆయన తెలిపారు. ఇండియన్ నేషనల్ సెంటర్‌ఫర్ ఓషన్ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీసెస్ మినిస్టరీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఇచ్చిన సమస్యను పరిష్కరించినందుకు ఈబహుమతిని గెలుపొందారని ఆయన తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను మెంటార్‌గా వ్యవహరించిన డాక్టర్‌ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, డైరెక్టర్ కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## ప్రయాణీకులకు సౌలభ్యం - సులబ్ కాంప్లెక్స్

కురబలకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త :



అంగళ్ళు బస్టాండువద్ద ప్రయాణీకుల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్‌ను నిర్వహించారు. అంగళ్ళు నుంచి వివిధ దూర ప్రాంతాలకు ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. బస్సులు వచ్చేంతవరకు బస్సు స్టాప్‌లో వేచిఉంటారు. మహిళలు,పిల్లలు వృద్ధులకు మరుగుదొడ్లు లేనందున తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వారి సౌకర్యార్థం స్థానిక గ్రామ పంచాయితీ అధికారులు, సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి చొరవచూపి పంచాయితీనిధులు రూ.15లక్షలతో మరుగుదొడ్లును సర్వాంగ సుందరంగా నిర్మించారు. త్వరలో ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించనున్నట్లు గ్రామసెక్రటరీ ఎంజిటి ప్రసాద్ తెలిపారు.

## విద్య నేర్పిన గురువులకు సన్మాన కార్యక్రమం

ములకల చెరువు, ఆగస్టు 28, ప్రభాతవార్త:



మండలంలోని పెద్దపాళ్యం ఎంపీయూపీ పాఠశాల 1972/73 బ్యాచ్ విద్యార్థులు, జూనియర్స్ గ్రామస్థులు పూర్వ ఉపాధ్యాయురాలు గడ్డం శకుంతలమ్మ భర్త చలపతి విద్యా ర్థులు క్రమశిక్షణ, విద్యా బుద్దులు నేర్పడానికి చాలా కృషి చేశారని అప్పటి విద్యా ర్థులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పూర్వ ఉపాధ్యాయురాలు శకుంతల మ్మ పెద్దపాళ్యం విచ్చేసిన సందర్భంగా ఆమెకు పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా ఉమామహేష్, సర్పంచి వెంకటరమణ, సోమశేఖర్, వేణుగోపాల్, కాటేపల్లి వెంకటరమణ, మల్లెల రెడ్డప్ప, కీష్టప్ప, బెస్త ఈశ్వరప్ప, జిల్లేడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం

తంబళ్లపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో గత 2 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్ల నీటి ఉధృతికి రాకపోకలు నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తంబళ్లపల్లె ములకల చెరువు ప్రధాన రహదారిలో చౌడ సముద్రం సమీపంలో పెద్దేరు వంక పెద్ద ఎత్తున ప్రవహిస్తుండడంతో బస్సులు, ఇతర వాహనాలు, ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీలు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సుమారు 35 కి.మీ దూరం చుట్టి రావాల్సి ఉంది. అదే విధంగా చిన్నపాటి వాగులు, వంకలు ప్రవహిస్తుండడంతో ప్రజలు తమ అవసరాలకు వెళ్లడానికి ముఖ్యంగా వినాయక చవితి పండగ సందర్భంగా సరుకులు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నిత్యావసరాలు తెచ్చుకోవడానికి కూడా పడరాని పాట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికార యంత్రాంగం తాగునీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోతే నీటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

## ఇక ప్రతిరోజు స్పందన కార్యక్రమం

– ఎంపీడీవో ఆనంద్‌కుమార్

తంబళ్లపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో ఇక ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గటల వరకు స్పందన కార్యక్రమం విధిగా జరుగుతుందని ఎంపీడీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. మారుమూల గ్రామాల్లోని ప్రజల సమస్యలను సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాల జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రనజల నుంచి ఎలాంటి సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు పరిష్కారానికి సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయ స్థాయిలో కార్యదర్శి స్పందన కార్యక్రమం నిర్వహించి సత్వర సమస్యలు పరిష్కరించి పరిష్కారం కానీ సమస్యలను మండల స్థాయి అధికారులకు నివేదికలు పంపాల్సి ఉంటుందన్నారు. ఈ స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సిద్ధంగా ఉండాలని ప్రనజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుందని సూచించారు.

## సంతానం కోసం శివుని ఎదుట సాష్టాంగ ప్రణామం

తంబళ్లపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ శివాలయంలో ఆదివారం వందలాది మంది మహిళలు సంతాన సౌభాగ్యం కోసం ఉపవాస దీక్షతో స్వామి ఎదుట సాష్టాంగ ప్రమాణం చేశారు. ఉదయం నుంచి దీక్షతో మహిళలు తొలుత వెలుగు మల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం గౌరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ముడుపులు కట్టి తదుపరి స్వామి వారి ధ్వజస్తంభం వద్ద అభిషేకాలు అర్చనలు జరిపి అనంతరం అభ్యంగస్నానంతో స్వామి ఆలయం చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి ఆలయంలో సాష్టాంగ ప్రణామం చేశారు. ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిలో వారికి సంతాన భాగ్యం కలగడానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. మల్లయ్య కొండ మహాశివునికి సంతానం కోసం ప్రార్థిస్తే ఖచ్చితంగా సంతానం కలగడం ఇక్కడి విశేషం.

## ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు గృహనిర్బంధం

మదనపల్లెక్రైం, ఆగస్టు 28 ప్రభాతవార్త :



సిపిఎస్ ధర్నాకు వెళ్ళకూడదంటూ ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల మధుసూదన్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. సిపిఎస్‌పై ధర్నా కార్యక్రమానికి వెళ్ళరాదంటూ ఆరురోజులు ముందే గృహనిర్బంధంలో ఉండాలని పోలీసులు తెలిపారు. పోలీసులు మాటలను ఖాతరు చేయని ఉపాధ్యాయులు సిపిఎస్ దర్నాలో పాల్గొనడానికి సిద్ధం అవుతుండగా ముందస్తుగా పోలీసులు యూటిఫ్ రాష్ట్ర కౌన్సిల్ రవిప్రకాష్, ఎస్టీయూ మదనపల్లె డివిజన్ కార్యదర్శి నరసింహు, తదితర ఉపాధ్యాయులను గృహనిర్బంధం చేశారు.

## రాజకీయాలలో ప్రజల భాగస్వామ్యం అవశ్యం

మదనపల్లెక్రైం, ఆగస్టు 28 ప్రభాతవార్త :




రాజకీయాలలో అవినీతి అంతం చేయాలనే లక్ష్యంతో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ తలపెట్టిన కార్యక్రమానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పార్టీ రాయలసీమ పార్లమెంటరీ సమన్వయ కర్త మైఫోర్స్‌మహేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జనసేన పార్టీ క్రౌడ్ పండింగ్‌పై ఉమ్మడి చిత్తూరు జిల్లా బాధ్య తలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాజకీయాల్లో పలుమార్పులు ఆశిస్తూ తాను నమ్మిన సిద్దాంతం భావాజాలాన్ని ప్రజలకుతెలియజేయడానికి ఎప్పటికప్పుడే నూతన పొంతను ఎంచుకోవడం లో జనసేన రాజకీయ పరిణితికి నిదర్శనమన్నారు. పలు పార్టీనాయకులు విరా ళాలు సేకరరించడం సాధారణమైతే జనం నుంచి విరాళాలు సేకరించి పార్టీకోసం వినియోగించడం పవన్‌కళ్యాణ్‌ను తీసుకువచ్చారని దీనిని ప్రతి ఒక్కరూ స్వాగ తించాలని పిలుపునిచ్చారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

– ఎస్సై శోభారాణి

తంబళ్లపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని ఎక్కడైనా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయస ంఘటనలు జరగకుండా చూడాలని అందుకు అనుమతి పొందిన పూచీకత్తుదారులదే బాధ్యత అని సూచించారు. విగ్రహాల వద్ద రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు, పోట్లాడుకోవడం జరగరాదని హెచ్చరించారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో యువత సమన్వయం పాటించి నీటి ప్రవాహాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. ప్రజలందరూ ఐకమత్యంతో కుల మతాలకతీతంగా సంతోషంగా వినాయక చవితి జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థుల ఆగ్రహ దీక్షను అడ్డుకోవడం తగదు

రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి

నందలూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



విశాఖ పట్టణంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆగ్రహ దీక్షను పోలీసులు అడ్డుకోవడం తగదని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం నందలూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌పార్టీ అధికారంలోకి వచ్చాక జగన్‌రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల ద్వారా విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ టిఎన్ఎస్ఎఫ్ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎం.శివ, చాపల తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత వైద్యం హర్షించదగ్గ విషయం

**బ్రహ్మంగారిమఠం, ఆగష్టు 28 ప్రభాతవార్త :**



వైద్యుడు కనిపించే భగవంతునితో సమానం. అలాంటి వృత్తిలో ఉండి మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేయడం హర్షించదగ్గ విషయం అని మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు బి.మఠం సహకార పరపతి సంఘం ఛైర్మెన్ నేలటూరి సుబ్బారెడ్డి, సేవా భారతి ఆధ్వర్యంలో డా॥ వెంకట సుబ్బారెడ్డి ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఈ శిభిరానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ వైద్య వృత్తిని చేపట్టిన వారు ఇలాంటి ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి గ్రామీణ పేద ప్రజలకు వైద్య సేవలందించడం గొప్ప విషయం అన్నారు.కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సాంఘీక సంక్షేమ జిల్లా ప్రత్యేక అధికారి డా॥ వెంకట సుబ్బయ్య, జడ్పీటీసి రామగోవిందరెడ్డి, ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, మైదుకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మెన్ శ్రీమన్నారాయణ రెడ్డి, అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్పోరేషన్ల డైరెక్టర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఉచిత మెగా వైద్య శిబిరం

**బద్వేలు అర్బన్, ఆగష్టు 28 ప్రభాతవార్త :**



పట్టణంలోని సంజీవని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన గైనకాలజిస్ట్ డా॥ పవిత్ర, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డా॥ కోటా సుమన్, జనరల్ మెడిసిన్, షుగర్ వ్యాధి నిపుణురాలు డా॥ వై.వి.సరస్వతి, కీళ్ళ వ్యాధి వైద్య నిపుణులు డా॥ జె.జిష్ణు, చర్మ వ్యాధులు మరియు కాస్మోటిన్ వైద్య నిపుణులు డా॥ మానసతో పాటు పలువురు అనుభవజ్ఞులైన వైద్యులచే నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిభిరం విజయవంతమైంది. సుమారు 100 మందికి పైగా వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి మందులను అందజేశారు.

## నేడు ప్రపంచ శాంతి ర్యాలీ

**వేంపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త :**

మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వేంపల్లెలో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మండల శాఖ ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3.00గంటలకు శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవణ నుండి కడప రోడ్డు మీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు ప్రపంచ శాంతిని కోరుతూ విద్యార్థులు, మానవత సభ్యులు సంఘ సేవకులు ర్యాలీగా వెళ్లి నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడతారని ఆయన చెప్పారు.

## ప్రశాంతంగా వినాయక చవితి పండుగ నిర్వహించుకోవాలి

**వేంపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



ప్రజలు ప్రశాంతంగా వినాయక చవితి పండుగ నిర్వహించుకోవాలని వేంపల్లె అర్బన్ సీఐ సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం పోలీసుస్టేషన్లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాలకు విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటి సభ్యులే బాధ్యతగా ఉండాలన్నారు. ఎవరి విగ్రహాల వద్ద వారే రాత్రిళ్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## నామాలగుండు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

**పులివెందుల రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



పులివెందుల మండలంలోని నామాలగుండు వద్ద ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మున్సిపల్ కమీషనరు నంసింహారెడ్డి అన్నారు. నామాలగుండు వద్ద నీటికుంటలో పడి ఇటీవల ముగ్గురు యువకులు మృతిచెందారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డిల ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సుడిగుండం ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించారు.

## ఓపన్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**పులివెందుల రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :**

2022-23 సంవత్సరానికి ఏపీ ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్ తరగతులకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వీరారెడ్డి తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి 14ఏళ్లు, ఇంటర్ ప్రవేశానికి సంబంధింఇ 15ఏళ్లు నిండి పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని లేదా ఓపన్‌స్కూల్ వెబ్‌సైట్ చూడాలని ఆయన తెలిపారు.

## స్వాతంత్ర సమరయోధుడు పెడబల్లి బాలయల్లారెడ్డి స్వాతంత్ర ఉద్యమానికి స్ఫూర్తిదాయకం

### ఎల్ఐసి సీనియర్ డివిజినల్ మేనేజర్ గిరిధర్

**చెన్నూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



చెన్నూరు కి చెందిన స్వాతంత్ర సమర యోధుడు పెడబల్లి బాల ఎల్లారెడ్డి స్వతంత్ర ఉద్యమానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయక మని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్( ఎల్ఐసి) కడప. కర్నూల్. అనంతపురం. సీనియర్ డివిజనల్ మేనేజర్ గిరిధర్ కొనియాడారు. ఆజాదీ క అమృత మహోత్సవాల్లో భాగంగా ఎల్ఐసి కడప బ్రాంచ్ వారి తరఫున ఆదివారం ఉదయం చెన్నూరు నాగలకట్ట వీధి లో ఉన్న స్వాతంత్ర సమర యోధుడు. పెడబల్లి బాల ఎల్లారెడ్డి(101) నీ సీనియర్ డివిజనల్ మేనేజర్. గిరిధర్. ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్. శంకర్ నాయక్. కడప డివిజినల్ ఎల్ ఐ సి ఓ ఎస్ మేనేజర్ షాహూ కడప ఎల్ఐసి డివిజనల్ మేనేజర్. శ్రీనివాసులు. బ్రాంచ్ మేనేజర్. వెంకట కృష్ణ. ఏబీఎం. విజయ్ కుమార్. ఎల్ఐసి ఉద్యోగ సంఘాల నాయకుడు . రఘునాథ రెడ్డి. లు సమరయోధుడు బాల ఎల్లారెడ్డి ని శాలువా కప్పి పూలమాలలతో సన్మానించడం అలాగే ఎల్ఐసి వారి తరఫున గోల్డ్ మెడల్ తో పాటు దీపికను అందజేశారు. స్వాతంత్ర సమర యోధుడు బాల ఎల్లారెడ్డి తో గత స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. నూట ఒక్క సంవత్సరం వయసు పైబడటం తో బాల ఎల్లారెడ్డి మాటలను ఆసక్తిగా ఎల్ఐసి అధికారులు విన్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసి అధికారులు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ కారుని కి తాము సన్మానించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని వారన్నారు. స్వాతంత్ర ఉద్యమ కారుడు బాల ఎల్లారెడ్డి కి తమతో పాటు ఎల్ఐసి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం లో ఎల్ఐసి ఉద్యోగులు. ఎల్ఐసి ఏజెంట్లు. చీర్ల చెన్నయ్య యాదవ్. శ్రీనివాసరాజు. వెంకటేశ్వర్లు. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మానవత సంస్థ చేయూత

**గాలివీడు, ఆగస్టు 28ప్రభాతవార్త:**



కష్టాల్లో ఉన్నప్పుడే ఒకరికొకరు సాయం అందించుకోవాలని. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం బాధ్యతగా భావించాలని ఈ మాటలను ఆచరించడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల లక్ష్యమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఛైర్మెన్ మలసాని సుబ్బారెడ్డి, సంస్థ అధ్యక్షుడు వెలిగంటి చంద్రారెడ్డి, కన్వీనర్ శివారెడ్డి, మానవత డైరెక్టర్, జిల్లా కమిటీ మెంబర్ కుడుమల రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు మండల కేంద్రంలోని స్థానిక యూనియన్ బ్యాంక్ దగ్గరలోని ఇటీవల కరెంట్ పోల్ మీద పడి గాయపడ్డ మక్బల్, అలాగే గేటు దగ్గరల్లోని బ్రెయిన్, హార్ట్ పెరాలసిస్‌తో బాధపడుతున్న రామచంద్రారెడ్డిలను వాళ్ల కుటుంబాల్ని సందర్శించి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మక్బల్‌కు రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో సంస్థ గాలివీడు శాఖ కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి చెంగల్‌రాజు, అత్యవసర విభాగం దామోధరయ్య, సభ్యులు హీరా, క్రిష్ణ, విశ్వనాథరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## తాళ్లపాక చెన్నకేశవస్వామి ఆలయంలో సెప్టెంబరు 1 నుండి 3 వరకు పవిత్రోత్సవాలు

**రాజంపేట అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

పదకవితా పితామహుడు నడియాడిన తాళ్లపాక శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో సెప్టెంబరు 1 నుండి 3 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి ప్రకటించింది. 1, 2, 3 తేదిల్లో పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. ఆగస్టు 31వ తేది సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఆలయంలో భక్తుల వల్ల కాని, సిబ్బంది వల్ల కాని తెలిసి తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా నిగారించేందుకు ప్రతియేటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. పవిత్రోత్సవాల్లో ఆలయశుద్ధి చేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సెప్టెంబరు 1న చతుష్టానార్చన, బింబారాధన, మండలారాధన, కుంబారాధన, కుండలారాధన, పవిత్రహవనం, పవిత్రహోమం, 2న పవిత్ర సమర్పణ, నిత్యహోమాలు, 3న పూర్ణాహుతి, పవిత్ర వితరణ, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరగనున్నాయి.

## రాజంపేట ముతవల్లిగా మౌలానాసాహెబ్

**రాజంపేట అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త**



రాజంపేట ప్రాంత ముతవల్లిగా జనాబ్ సయ్యద్ మౌలానా సాహెబ్‌ను ఎంపిక చేశారు. స్థానిక జామియా మసీదులో ఆదివారం రాజంపేట ప్రాంతంలోని మసీదుల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశమయ్యారు. గత యేడాది ఆగస్టు 28న రాజంపేట ఏరియా ముతవల్లి నూరుద్దీన్‌సాహెబ్ మరణించడంతో ముతవల్లిని నియమించలేదు. ఈనేపథ్యంలో పాతబస్టాండు మసీదు అధ్యక్షునిగా పనిచేసిన సయ్యద్ మౌలానాసాహెబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా కొత్త ముతవల్లి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, మత సామరస్యానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, పెద్దమసీదు కార్యదర్శి సయ్యద్ కరిముల్లా, సయ్యద్ షామీర్‌బాషా, మౌలానా, జాబిర్, ఎస్‌జి సలీమ్, ఎస్‌జి వినయతుల్లా, గండికోట గుల్జార్‌బాషా, మండెం హబీబ్, షేక్ జాహిద్‌అలీ, షేక్ అబ్దుల్‌మునాఫ్, షేక్ నిజాంజాని తదితరులు పాల్గొని కొత్త ముతవల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్‌కు సన్మానం

**పులివెందుల, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



పులివెందులలోని మానవత సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. మున్సిపల్ ఛైర్మన్, మానవత సంస్థ కోఛైర్మన్ వరప్రసాద్ డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వరప్రసాద్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## భారతీయ కిసాన్ సంఘం నూతన కమిటి ఏర్పాటు

**రాజుపాళెం, ఆగష్టు 28, ప్రభాతవార్త.**



మండల భారతీయకిసాన్ సంఘం నూతన కమిటి ఆది వారం ఎర్పాటు అయినది. ఎన్నుకొబడిన కమిటి చేర్మేన్ గా ఎం.హరిచంద్రారెడ్డి, ఉపా ధ్యాక్షులు,కమిటి సభ్యులను జిల్లా అధ్యక్షులు సహదేవరెడ్డి,రైతులు అందరు అభినందించారు.మండల పరిధిలోని వెల్లాల గ్రామంలోని సీతారామకళ్యాణ మండపంలో జరిగిన భారతీయకిసాన్ సంఘం రైతులు సమావేశం నిర్వహించి మండల కమిటినిఎర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా సి.కొండారెడ్డి,ఎన్.తులసీశ్వరరెడ్డి, ఏ.శ్రీనివాసులరెడ్డిలు ,కమిటి సభ్యులుగా ఎం.దిలీప్‌కుమార్‌రెడ్డి,జె.సుదర్శన్‌రెడ్డి, డి.అంకిరెడ్డి,జి.దస్తగిరిరెడ్డి, జి.నాగేశ్వరరెడ్డిలు ఎన్నుకొబడ్డారు.ఈసందర్బంగా చేర్మేన్ హరిచంద్రారెడ్డి కమిటి సభ్యులతో కలిసి మాట్లాడుతూ మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించటంతో పాటు,వ్యవసాయ అభివృద్ధికి పాటుబడు తామని తెలిపారు.రైతుభరోసా కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని రైతు పథకాలను వినయోగించుకోవాలని తెలిపారు.సంబంధిత అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు సలహాలు ఇవ్వటం పంటల దిగుబ డులు పెంచుటకు,రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

## 37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

**రాయచోటి రూరల్, ఆగస్టు 28ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగి న కంటి వైద్య శిబిరంలో 37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియో జకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, కె.వి.పల్లె, యర్రావారిపాళెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 90 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 37 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు.గతంలో ఆపరేషన్ చేయించుకున్న 47 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మెన్ చెన్నూరు అన్వర్ బాషా, ఏపిఐఐసి రామ చంద్రారెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, మహాలక్ష్మీ, భార్గవి, శశిబిందు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

**లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:**



మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక బోనాలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ ఈవో రవీంద్రరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అనంతరం చెల్లు వంశీయులు గంగన్న కుటుంబీకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సురేంద్ర, గంగన్న, ఆలయ సిబ్బంది నారాయణ, నాగేశ్వరమ్మ, మార్కండేయ, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులకు సరుకులు పంపిణీ

**బద్వేలు అర్బన్, ఆగష్టు 28 ప్రభాతవార్త :**

పట్టణంలో సుమారు గత 10 సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్యులను గుర్తించి వారికి అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరుకులను వాసవీ, వనిత క్లబ్ సభ్యులు దాతల సహకారంతో ప్రతి నెలా అందజేస్తూ పేద ఆర్యవైశ్యుల పట్ల ఆసరాగా నిలుస్తున్నారు. పట్టణంలో సుమారు 1300 కుటుంబాలు ఆర్యవైశ్యులు నివాసం ఉన్నారు. అయితే వారిలో 30 శాతం పైగా చాలీ చాలని వ్యాపారాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ఆర్యవైశ్యులను గుర్తించి దాతల సహకారంతో ప్రతి నెలా వాసవీ, వనిత క్లబ్ తరుపున అమృతకలశం నిత్యావసర సరుకులను అందజేస్తున్నారు. ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో వాసవీ క్లబ్ అధ్యక్షులు తిరువీధి మురళీ కృష్ణ, వనిత క్లబ్ అధ్యక్షురాలు తులసి రాధికతో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమృత కలశం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు అనుమలశెట్టి సిద్దయ్యతోపాటు పలువురు కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధిగ్రస్థుడికి ఆర్థిక సాయం చేస్తున్న వైసీపీ నాయకులు, సర్పంచులు

**ఓబులవారిపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పాణ్యం మనెయ్యకు ఇటీవల కాలేయ వ్యాధితో బాధపడుతుండడంతో ఎల్లాయపల్లె సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, పెద్దఓరంపాడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, పాపిరెడిపల్లె గ్రామానికి చెందిన రామిరెడ్డిలు మంచి మనసుతో ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ముఖ్యంగా ఆ గ్రామంలో ఇబ్బందులు పడుతున్న వారికి మేమున్నామంటూ భరోసా ఇస్తూ అన్ని విధాలా ఆర్థిక సాయం అందించడం వారికి ఎంతో మనసుందని గ్రామస్థులు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జరుగునారాయణరెడ్డి ఆయన పంచాయతీలోనే కాకుండా మండలంలో పలు చోట్ల దేవాలయాలకు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సాయం చేస్తూ మంచి మనసున్న సర్పంచిగా మన్ననలను పొందుతున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సర్పంచి ఆళ్ల అర్పన, తదితరులు పాల్గొన్నారు.

## బాదుడుతో సామాన్యులకు మోయలేని భారం

### మండల టిడిపి అధ్యక్షులు భానుగోపాల్ రాజు

**వీరబల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రజలను నమ్మించి వంచిందని వీరబల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం బానుగోపాల్ రాజు విమర్శించారు. మండలంలోని వీరబల్లి గ్రామపంచాయతీలో ఆసాది మాలపల్లి, పెద్ద మాదిగ పల్లెలో ఆదివారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు రెడ్డి, సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి, అమరేశ్వర రాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు ,ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై మోయలేని భారాన్ని మోపారని తెలియజేశారు .వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు విపరీతంగా నష్టపోతున్నారని చెప్పారు. పెంచిన ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు చేపట్టి ప్రజల బాధలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రాజారాజు, మండల ఉపాధ్యక్షులు దుర్గం ఆంజనేయులు, తెలుగు యువత నాయకులు నేతి రమేష్ బాబు, సీతారామరాజు, లక్ష్మి రెడ్డి, రాచరాయుడు ,పవన్ కుమార్ ,వర్ల ఆంజనేయులు ,పవన్ కుమార్ రెడ్డి, రామకృష్ణంరాజు, వినయ్, మంజునాథ ,హరి ,నరసింహ నాగార్జున ,అనిల్ ,ఆటో శివ ,సాయి, రామకృష్ణ ,నాగయ్య ,కేశవరాజు, రామ్మోహన పాల్గొన్నారు.

## రక్తదానం మరోకరికి ప్రాణదానం

### – ప్రభుత్వాస్పత్రి కమిటి సభ్యులు బేపారి మహమ్మద్ ఖాన్

**రాయచోటి, ఆగస్టు 28ప్రభాతవార్త:**



ప్రజలు ఇచ్చే రక్తదానం మరోకరికి ప్రాణదానమని రాయచోటి ఆసుపత్రి కమిటి సభ్యులు బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. ఆదివారం దీప బ్లడ్ బ్యాంకు నందు హెల్పింగ్ హ్యాండ్స్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ముందుకు వచ్చి అత్యవసర పరిస్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మెన్ సయ్యద్ మైనుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాహిల్ హర్షద్, అభు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### – జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథ రెడ్డి

**చిన్నమండెం, ఆగస్టు 28ప్రభాతవార్త:**



దాతలు మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేయుచున్న పలు రకాల వైద్య శిబిరాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని దిగువగొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎల్.వి. ప్రసాద్, నే త్ర వైద్య విజ్ఞా న కేంద్రం మదనపల్లె వారిచే ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవనాథరెడ్డి మాట్లాడుతూ మదనపల్లె ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం వైద్యులచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అలాగే ఆపరేషన్లు అర్హులైన వారికి కూడా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ రాజమ్మ, సంజీవి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయశేఖర్, సర్పంచ్ భర్త రమణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 9 మంది జూదరులు అరెస్ట్

**దువ్వూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గుడిపాడు గ్రామ సమీపంలో ఆదివారం జూదమాడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కేసీ రాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు పోలీసులుతో దాడులు నిర్వహించామని గ్రామ సమీపంలోని కంప చెట్లలో పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.12500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉద్యోగులకు నోటీసులు జారీ

**దువ్వూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

సెప్టెంబరు 1వ తేదీ సీపీఎస్ రద్దు ఉద్యమం కోసం విజయవాడకు వెళ్లకుండా మండలంలోని వివిధ పాఠశాలలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. విజయవాడలో జరిగే సీపీఎస్ రద్దు ఉద్యమానికి ప్రభుత్వ అనుమతి లేదని, అందువల్ల విజయవాడ వెళ్లరాదని ఆ నోటీసులో తెలిపారు. విజయవాడ వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఉన్న ఎస్టీయూ, ఏపీటీఎస్ తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులకు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

## ఇడుపులపాయలో సీఎం పర్యటన ఏర్పాట్లపై పరిశీలన

**వేంపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త :**



సెప్టెంబరు 1, 2 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఇడుపులపాయలో ఆయన పర్యటన దృష్ట్యా ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు విజయ్‌రామరాజు ఆదివారం పర్యటించారు. నెమళ్లపార్కులోని ఓపన్‌చర్చిలో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సలహాలు ఇచ్చారు. అనంతరం సమీపంలోనే వేర్వేరుగా పార్టీ కార్యకర్తలతో నిర్వహించే మూడు సమావేశాల నిర్వహణకు ఏర్పాట్ల గురించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లోని వైఎస్ఆర్ ఘాట్, ముఖ్యమంత్రి బస చేసే గెస్ట్‌హౌస్, ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించే సభాస్థలి ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలలో ప్రోటోకాల్ ఏర్పాట్లు, బందోబస్తు, హెలిప్యాడ్ నిర్మాణం, పలు నిర్మాణాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బంధీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పులివెందుల జమ్మలమడుగు ఆర్డీవోలు వెంకటేష్, శ్రీనివాసులు, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరికీ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

### – డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి



**రాయచోటి, ఆగస్టు 28ప్రభాతవార్త:**

శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రాంగణ ఎంపికలో భూమిక తమ కళాశాలలో చదువుతూ రెండు సంస్థలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. తమ కళాశాలలో ఆర్థమెటిక్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై అందిస్తు ప్రత్యేక శిక్షణతో చాలా మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రముఖ సంస్థలకు ఉద్యోగులుగా ఎంపిక కావడం జరుగుతుందన్నారు. కళాశాలలో ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తమ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించి ప్రాంగణ ఎంపికల్లో అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి చంద్రశేఖర్, ప్లేస్మెంట్ అధికారి ఇంతియాజ్, విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బాలికల వసతిగృహాలలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

**బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 28 ప్రభాతవార్త :**



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు పెద్ద పీట వేస్తూ కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తున్నారని, అలాంటి విద్యార్థులకు వసతిగృహాలలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ వెంకట సుబ్బయ్య, జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహం-1, 2 లను ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం వసతిగృహం నందు మధ్యాహ్నం మెనూను పరిశీలించగా ఆదివారం విద్యార్థులకు చికెన్ చేయాల్సి ఉండగా భోజన సమయం దగ్గర పడుతున్నా చికెన్ తీసుకురాకపోవడం విచారకరం అని, జిల్లా అధికారులు గుర్తించి సంబంధిత వసతిగృహాల అధికారులను మందలించడంతో అప్పుడు వెళ్ళి చికెన్ తీసుకురావడం జరిగింది. విద్యార్థులకు మెనూ పాటించడంలో పొరపాటును క్షమించేది లేదని, చర్యలు తప్పవన్నారు. అలాగే ఎస్సీ-1 వసతిగృహంలో 150 మంది విద్యార్థులకు గాను 70 మంది విద్యార్థులు ఉండడం, అలాగే ఎస్సీ-2 వసతిగృహంలో 120 మందికిగాను 60 మంది విద్యార్థులు ఉండడంతో అధికారులు ఆరా తీసి మిగిలిన వారు ఎక్కడికి వెళ్ళారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వసతిగృహంలోని మంచినీటి కుళాయిల దగ్గర లీకేజీ అవుతూ అక్కడే పాచి పట్టడం గమనించిన అధికారులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు తనిఖీలకు వెళ్ళిన సమయంలో వసతిగృహ వార్డన్‌లు అందుబాటులో లేకపోవడంతో వారిపై అధికారులు మండి పడ్డారు. ఇలాంటివి మరో మారు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులు మందలించి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో వసతిగృహాల వార్డన్లు ఉన్నారు.

## యువత ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### – టిడిపి నాయకుడు మండిపల్లి రాముడు

**రాయచోటి, ఆగస్టు 28ప్రభాతవార్త:**



ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం రోడ్డు ప్రమాదంలో మరణించిన గఫార్ ఖాన్ ముక్తార్ అలీ ఇంతియాజ్ ఖాన్ మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్ల విస్తరణ చేయడంతో యువత వాహనాలను వేగంతో నడపడం వల్ల ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. ప్రమాదాల వల్ల కుటుంబం పెద్దదిక్కు కోల్పోయి భార్యాపిల్లలు అనాధలుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని రాంప్రసాద్‌రెడ్డి కోరారు. అనునిత్యం రాయచోటి చుట్టుపక్కల ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసు యంత్రాంగం హైవే పెట్రోలింగ్ పోలీసులు వాహనాలను వేగంగా వెళ్లే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పుల్లంపేటలో వీధిలైట్లు

**పుల్లంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త**

వినాయకచవితి పండుగను పురస్కరించుకొని పుల్లంపేట గ్రామ పంచాయతిలో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల రిపేరు వచ్చి వెలగకుండా ఉండినవి, మరికొన్నిచోట్ల కొత్తగా ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సిబ్బంది వెంట ఉండి వీధుల్లో లైట్లను పరిశీలిస్తూ ప్రతి వీధిలోను లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. వినాయకచవితి పండుగను పురస్కరించుకొని పలుచోట్ల ప్రజలు విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. అందుకోసం వీధుల్లో రాత్రి సమయాల్లో వెలుతురు ఉండేవిధంగా మహిళలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, వెలుతురులో విగ్రహాల వద్దకు వచ్చి పూజలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా ఉండేందుకు ఈ వీధిలైట్ల కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీనివాసులరెడ్డి వివరించారు.